


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




వినాయక చవితి సందర్భంగా చైతన్యరథం పాఠకులకు శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా నేడు సోమవారం పత్రికకు సెలవు దినం. మంగళవారం సంచిక వెలువడదు. పాఠకులు గమనించగలరు.



## విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలి

- రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు వినాయక చవితి శుభాకాంక్షలు

అమరావతి(చైతన్యరథం): వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపా రు. విఘ్నాలను తొలగించి విజయాలను అందించేలా వినాయక చవితిని ఊళ్లు, కాలనీలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుం డా వాడవాడలా అన్ని వర్గాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చే గొప్ప సామాజిక పండుగ వినాయక చవితి. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మట్టి వినాయ క ప్రతిమలను పూజిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరింత వైభవంగా కొనసాగిద్దాం. ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నా లకు ఎటువంటి ఆటంకాలు ఎదురవ్వకుండా ఆశీర్వదించాలని గణనాథుడిని వేడుకున్నారు.

## నేడు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ముస్తాబైన తిరుమల మాఢవీధులు
- టీటీడీ భారీ భద్రతా ఏర్పాట్లు
- రేపు పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



*తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల కు ముస్తాబైంది. సెప్టెంబరు 15 నుంచి 23 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సోమవారం అంకురార్పణ జరగనుంది. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహన సేవలు నిర్వహించనున్నారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రావాలని సీఎం చంద్ర బాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానాలు అందాయి. కాగా 15న మంగళవారం శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు సమాచారం. బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈసారి సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు.*

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల

- ఇన్ సర్వీస్ టీచర్లలో 51 శాతం, రెగ్యులర్ అభ్యర్థుల్లో 47 శాతం ఉత్తీర్ణత
- మంత్రి నారా లోకేష్ అభినందనలు




అమరావతి(చైతన్యరథం): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్ 2026) ఫలితాలను మంత్రి నారా లోకేష్ ఆదివారం విడుదల చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లలో 51 శాతం మంది, రెగ్యు లర్ అభ్యర్థుల్లో 47 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. టెట్‌లో విజయం సాధించిన అభ్యర్థులకు మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. అర్హత సాధించలేకపోయిన వారు నిరుత్సాహపడొద్దని, విజయం అనేది ఓ ప్రయాణమని ధైర్యం చెప్పారు. టెట్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఇందుకోసం ఏపీ టెట్ ఫలితాల పోర్టల్ https://tet2dsc. apcfss.in/ను ఓపెన్ చేసి చూసుకోవచ్చని అధికారులు సూచించారు. వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం కల్పించారు. ఇందు కోసం 9552300009 నెంబర్‌ను ఉపయోగించుకోవచ్చని సూచించారు.



## సాగర తీరంలో మహాగణపతి

2

- మంగినపూడి బీచ్‌లో 63 అడుగుల విగ్రహం
- ప్రముఖ ఆలయాల నమూనాలు ఏర్పాటు
- ఆధ్యాత్మిక, పర్యాటక శోభ తీసుకొచ్చేలా భారీఎత్తున నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు, గవర్నర్‌లకు ఆహ్వానం

*మచిలీపట్నం సాగరతీరం గణపతి నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోబోతోంది. ఇందుకోసం దేశంలోనే తొలిసారిగా మంగినపూడి బీచ్ సముద్రతీరంలో సుమారు 63 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. మచిలీపట్నానికి పర్యాటక సొబగులు అద్దే మహోన్నత లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. మహాగణపతి ఆలయంతో పాటుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయం, సింహాచలం వరాహనరసింహస్వామి వారి దేవాల యం, భద్రాద్రి రాముల వారి నమూనా ఆలయాలు, ప్రచార రథాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. సాగరతీరంలో హోమాలు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధం చేశారు. ఖైరతాబాద్ విగ్రహం నిర్మాణం చేపట్టే నిపుణులతోనే ఈ విగ్రహం నిర్మాణం జరిగింది. స్పీడ్ బోట్స్, పారా గ్లైడింగ్ లాంటి వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు రావాల్సిందిగా సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఆహ్వానించారు.*



## డీఎస్సీపై గొడ్డలి పార్టీ దుష్ప్రచారం

- ఎంపికైన అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నారు
- పారదర్శకంగా జరిగిన నియామకాలపై బురదజల్లడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం

3

## తిరుమలకు ఎలక్ట్రిక్ బస్సులు 16న సీఎం చేతులమీదుగా ప్రారంభం



తిరుమల తిరుపతి దేవస్థానానికి రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన 25 ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సుల్లో 15 బస్సులు ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకున్నాయి. ఈ ఏడాది జూన్‌లో శ్రీవారిని దర్శించుకున్న ఆయన తితిదేకు రూ.27.5 కోట్ల విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులు, వాటికి అవసరమైన 50 మంది డ్రైవర్లు, ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముందుగా 15 బస్సులు వచ్చాయి. ఈ బస్సులను శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సామాన్య భక్తుల సౌకర్యార్థం ఈనెల 16న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

# గణపతి ఉత్సవాలతో బందరుకి ఆధ్యాత్మిక, పర్యాటక శోభ

- మంగినపూడి సాగరతీరంలో భారీ ఎత్తున వేడుకలు
- కట్టుదిట్టంగా ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు
- గవర్నర్, ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- పర్యాటక, పారిశ్రామికాభివృద్ధికి కేంద్రంగా మచిలీపట్నం
- మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం సముద్ర తీరాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, కళా క్షేత్రంగా మార్చి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. మంగినపూడి సాగరతీరం గణపతి నవరాత్రులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోబోతోందన్నారు. లోక కల్యాణార్థం 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మహాగణపతి ఆలయంతో పాటుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయం, సింహాచలం వరాహనరసింహస్వామి వారి దేవాలయం, భద్రాద్రి రాముల వారి నమూనా ఆలయాలు, ప్రచార రథాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సాగరతీరంలో హోమాలు ఏర్పాటు చేసుకుని మంత్రోచ్చారణలతో అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కుల మత ప్రాంతాలకు అతీతంగా భక్తులంతా హాజరవుతుండడం ఆనందం. పర్యాటక రంగం, దేవాదాయ శాఖ నుండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు.

**భారీ ఏర్పాట్లు**

కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రత్యేకంగా ట్రాఫిక్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంతం మొత్తాన్ని వన్ వే చేశాం. తద్వారా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకమూ ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ఏపీలోనే మొట్టమొదటి సారిగా ఈ ప్రాంతం మొత్తంలో భారీ ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశాం. సముద్రతీరంలో లైట్లు, వాచ్ టవర్స్ ఏర్పాటు చేశాం. ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచాం. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, సహా ఎంతో మంది ప్రముఖులు హాజరవుతారు. ప్రతి ఇంటి నుండి మట్టి సేకరించాలనే పిలుపు మేరకు విగ్రహ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

**ఖైరతాబాద్ విగ్రహ నిపుణులతోనే..**

ఖైరతాబాద్ విగ్రహం నిర్మాణం చేపట్టే నిపుణులతోనే ఈ విగ్రహాన్ని నిర్మించాము. సముద్రతీరంలో హోమ గుండాలు ఏర్పాటు చేశాం. కర్నాటక నుండి వచ్చే కొంత మంది పీఠాధిపతులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ వేగంగా పూర్తవడంతో పాటుగా, ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక పర్యాటక పారిశ్రామిక శోభ కలిగేలా కార్యక్రమాలు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధికి అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా ఈ ప్రాంతంలో రూ.100 కోట్లతో పెట్టుబడులు రాబోతున్నాయి. పర్యాటకులు వచ్చి వెళ్లేలా కాకుండా.. ఇక్కడే బస చేసేందుకు వీలుగా కొన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. సుమారు 750 ఎకరాలను గుర్తించాం. వాటిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఆ భూముల్ని పర్యాటకంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. గోల్ఫ్ కోర్ట్, ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో స్టూడియోల నిర్మాణం సహా అనేక పెట్టుబడులు రాబోతున్నాయని మంత్రి రవీంద్ర తెలిపారు.

**ప్రతిఏటా నిర్వహిస్తాం**

స్పీడ్ బోట్స్, పారా గ్లైడింగ్ లాంటి వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. పది రోజుల పాటు జరిగే వేడుకల అనంతరం జెట్ స్ప్రింక్లర్స్ ద్వారా స్వామి వారి నిమజ్జనం జరుగుతుంది. ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఈ ఉత్సవాన్ని ఇలాగే ప్రతి సంవత్సరం కొనసాగించడంతో పాటుగా, స్థానిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం బీచ్ ఫెస్టివల్ సహా వారాంతంలో కూడా వినోద కార్యక్రమాలు నిర్వహిస్తాం. మచిలీపట్నం సముద్రతీరంలో నిరంతరం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ.. పర్యాటక శోభ తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇంటా సంక్షేమం, సౌభాగ్యం వెల్లివిరియాలి

**- మంత్రి మండిపల్లి వినాయక చవితి శుభాకాంక్షలు**



రాయచోటి (చైతన్యరథం): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి ఇల్లు సంక్షేమం, సౌభాగ్యం, సంతోషాలతో శోభాయమానంగా వెలుగొందాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లోని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు. అన్నమయ్య జిల్లాలోని పల్లెసీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, వ్యాపారులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలని కోరుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.

## పిడుగుపాటు మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సానుభూతి

*ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా*

అమరావతి (చైతన్యరథం): పిడుగుపాటుకు గురై పల్నాడు జిల్లాలో నలుగురు మృతిచెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం, మోపిరివారిపాలెం, కాకాని శివారు లక్ష్మీపురం, పాలపాడు గ్రామాలకు చెందిన తలపనేని నాగమ్మ, మజ్జిగ చిన్న కోటేశ్వరరావు, మేకల వెంకాయమ్మ, దేరంగుల వెంకటయ్య అనే నలుగురు పిడుగులు పడి మృతిచెందడం బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. పండుగ పూట నాలుగు కుటుంబాల్లో విషాదం నెలకొనడం బాధాకరమని అన్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**నేడు పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు**

పలు జిల్లాల్లో సోమవారం పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామ రాజు, పోలవరం, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, మార్కాపురం, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది.



## మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలి
- రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి
- మంత్రి అచ్చెన్నాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు

కోటబొమ్మాళి/శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజించే పవిత్రమైన రోజున ప్రతి కుటుంబానికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. వినాయకుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లో ఎదురయ్యే అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రతి ఒక్కరూ సంతోషంగా, ప్రశాంతంగా జీవించాలని మంత్రి ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర రంగాల్లో ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలని, యువతకు ఉజ్వల భవిష్యత్ లభించాలని కోరారు. వినాయక చవితి వేడుకలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలంతా భక్తి, శ్రద్ధలతో పండుగను జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించి, పర్యావరణానికి హాని కలగకుండా వేడుకలను నిర్వహించాలని కోరారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుస్థిర అభివృద్ధి, ప్రజా సంక్షేమం మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, విద్యార్థులు సహ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.



**పర్యావరణ హితంగా..**

వినాయక చవితి సందర్భంగా ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, రసాయనాలు, హానికర పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- ముస్తాబైన తిరుమల మాఢవీధులు
- టీటీడీ భారీ భద్రతా ఏర్పాట్లు
- రేపు పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



తిరుమల(చైతన్యరథం): శ్రీవేంకటేశ్వర స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబైంది. ఈ వేడుకలను తితిదే మంగళవారం నుంచి 23వ తేదీ వరకు కనులపండువగా నిర్వ హించనుంది. సోమవారం సాయంత్రం శ్రీనివాసుడి సేనాధిపతి విష్వక్సేనుడు ఆలయ పరిసరాలు, తిరువీధుల్లో విహరించి ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు. వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చారణ నడుమ భూమిపూజ చేసి పుట్టమట్టి సేకరించి, యాగశాలలోని కొత్తపాలికల్లో నవధాన్యాలు పోసి అంకురార్పణ చేయనున్నారు. మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం అనంతరం స్వామివారు పెద్దశేష వాహనంపై తిరువీధుల్లో విహరిస్తారు. నిత్యం ఉదయం 8 గంటలకు, సాయంత్రం 7 గంటలకు వాహనసేవలు నిర్వహించనున్నారు. 19న రాత్రి గరు డ సేవను అర్ధరాత్రి వరకూ కొనసాగిస్తారు. 20న సాయంత్రం స్వర్ణ రథోత్సవం, 22న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనంతో వాహనసేవలు ముగియనున్నాయి. 23న ఉదయం 6 గంటల నుంచి పుష్కరిణిలో చక్రస్నానం ఉంటుంది. బ్రహ్మోత్స వాల దృష్ట్యా ఈ నెల 15 నుంచి 23 వరకు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన, తిరుప్పావడ, కల్యాణోత్సవం, ఊంజల్, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దుచేసింది. వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రొటోకాల్ పరిధిలో ఉండి స్వయంగా వచ్చేవారికి పరిమితం చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లి దండ్రులు, ఎన్ఆర్ఐలు, దాతలకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది.

### సీఎం చంద్రబాబు, గవర్నర్‌కు ఆహ్వానం

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు రావాలని సీఎం చంద్రబాబును టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ఆహ్వానించా రు. లోకభవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలసి బ్రహ్మోత్సవా లకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. కాగా 15న శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించనున్న దృష్ట్యా ఏర్పాట్లపై దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించారు.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ భద్రతా ఏర్పాట్లు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో కమ్యూనికేషన్‌కు అంతరా యం లేకుండా జియో నెట్‌వర్క్ స్లైసింగ్ సాంకేతికతను, గ్యాలరీల్లో భక్తుల సంఖ్యను లెక్కించేందుకు ఏఐ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగించనుంది. తోపులాటలను నివా రించేందుకు కొత్త ఎగ్జిట్ ప్లాన్, 3,000 కెమెరాలతో పర్యవేక్షణ, దొంగతనాలను అరికట్టేందుకు 40 విజిలెన్స్ బృందాలు, మొత్తం 5,300 మంది సిబ్బందితో బందోబస్తు, ప్రత్యామ్నాయ పార్కింగ్, ప్రత్యేక ఫ్యాక్ట్ చెక్ సెల్ ఏర్పాటు చేస్తున్నారు. గరుడ సేవ వంటి ప్రధాన రోజుల్లో తిరు మల మాడ వీధులకు భారీగా భక్తులు చేరుకుంటారు. గ్యాలరీల్లో రద్దీని కచ్చితంగా అంచనా వేసేందుకు తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఆధారిత హెడ్ కౌంటింగ్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇందుకోసం దాదాపు 200 కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్యాలరీలను గ్రిడ్లుగా విభజించి ప్రతి ప్రాంతంలో ఉన్న భక్తుల సంఖ్యను రియల్‌టైమ్‌లో గుర్తించేలా వ్యవస్థను రూపొందించారు. ఏదైనా గ్యాలరీ సామర్థ్యా నికి చేరుకుంటే వెంటనే అప్రమత్తమై భక్తు లను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించవచ్చు. అలిపిరి టోల్‌గేట్, నడకమార్గాలు, శ్రీవారి మెట్టు వద్ద ఫేషియల్ రికగ్నిషన్, ఆటోమే టిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. విజిలె న్స్, పోలీసు సిబ్బంది కలిపి 5,300 మందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుమలలో పార్కింగ్‌కు ఏడు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పార్కింగ్ సదుపాయాలను వినియోగించనున్నారు.



## గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిసిన చిన్న శ్రీను

గోవా (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీలో చేరిన అనంతరం ఉమ్మడి విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) తొలిసారి గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. గోవాలోని గవర్నర్ బంగ్లాలో ఆదివారం కుమార్తె మజ్జి సిరి సహస్రతో కలిసి గవర్నర్ అశోక్ గజపతిరాజుని చిన్న శ్రీను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌తో ఆత్మీయంగా మాట్లాడి, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కూడా పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో తన కొత్త రాజకీయ ప్రయాణం నేపథ్యంలో అశోక్ గజపతిరాజుని కలసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందని చిన్న శ్రీను తెలిపారు. విజయనగరం, ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి పెద్దల సూచనలు, ఆశీస్సులతో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్న శ్రీనుకి, సిరి సహస్రకి అశోక్ గజపతిరాజు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందించారు.

# డీఎస్సీపై గొడ్డలి పార్టీ దుష్ప్రచారం

- ఎంపికైన అభ్యర్థులే వాస్తవాలు చెబుతున్నారు
- పారదర్శకంగా జరిగిన నియామకాలపై బురదజల్లడం జగన్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం
- సీఎం చంద్రబాబు నాయకత్వంలో యువతకు ఉద్యోగ భరోసా
- మంత్రి లోకేష్ చొరవతో నియామకాల్లో వేగం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం (చైతన్యరథం): అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీ ఎంపిక ప్రక్రియపై గొడ్డలి పార్టీ, జగన్ రెడ్డి చేస్తున్న దుష్ప్రచారానికి ఎంపికైన అభ్యర్థులే వాస్తవాలతో సమాధానం చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన అభ్యర్థిని ఆదివారం కలిసిన పల్లా ఎంపిక ప్రక్రియపై స్వయంగా వివరాలు తెలుసుకున్నారు. పరీక్ష, కౌన్సెలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రతి దశలోనూ పారదర్శకత పాటించామని అభ్యర్థి స్పష్టం చేసినట్లు పల్లా తెలిపారు.

### 16 వేల పోస్టులు.. వంద శాతం పారదర్శకత

డీఎస్సీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని పల్లా తెలిపారు. 16 వేల పోస్టుల భర్తీలో ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా ప్రతి దశను నిబంధనల ప్రకారం పూర్తి చేశామని స్పష్టం చేశారు. క్రీడా కోటాలోనూ అభ్యర్థుల అర్హతలు, ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో ధ్రువీకరణ చేపట్టామని చెప్పారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా వంద శాతం పారదర్శకంగా, మెరిట్ ప్రాతిపదికన నియామకాలు జరిగాయని పల్లా స్పష్టం చేశారు. అక్రమాలు జరిగిందని ఆరోపిస్తున్న వారు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు.

### దొంగే దొంగ అన్నట్లు గొడ్డలి పార్టీ తీరు

వైసీపీ హయాంలో డీఎస్సీ నిర్వహణను గాలికొదిలేసిన వారు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియపై బురదజల్లడం విడ్డూరంగా ఉందని పల్లా మండిపడ్డారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్ 1 నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలు, అవకతవకలపై వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే ప్రజల దృష్టిని మళ్లించేందుకు డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని పల్లా విమర్శించారు. అభ్యర్థులు ఎన్నో నెలలు, సంవత్సరాలు కష్టపడి సాధించిన ఉద్యోగాలను రాజకీయ రాద్ధాంతంలోకి లాగడం జగన్ రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

### చంద్రబాబు పాలనలో యువతకు భరోసా

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం



ఇస్తోందని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతో నియామక ప్రక్రియలకు వేగం వచ్చిందని, మెరిట్‌కు పెద్దపీట వేస్తూ యువతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. ఎన్ని కుట్రలు, ఎన్ని ఆరోపణలు చేసినా వాస్తవాలను కప్పిపుచ్చలేరని.. డీఎస్సీపై గొడ్డలి పార్టీ చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పల్లా స్పష్టం చేశారు.

# ఎల్-నినోను ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

- ప్రతి పంటను కాపాడాలి, అందుబాటులోని ప్రతి నీటి వనరునూ వినియోగించాలి
- రైతులకు అండగా ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- 284 మండలాల్లో పంటల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ
- 2.44 లక్షల హెక్టార్లలో పంటలపై ప్రభావం, రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి
- పంట ఆరోగ్య వివరాల నమోదులో పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలి
- ప్రత్యామ్నాయ, తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ప్రోత్సహించాలి
- వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్షలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని, తేమ లేమిని ఎదుర్కొంటున్న పంటలను కాపాడేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్-నినో పరిస్థితులు, వర్షపాతం, ఖరీఫ్ సాగు, పంటలపై ప్రభావం, పంట ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటల సాగు, అందుబాటులో ఉన్న నీటి వనరులతో పంటలను కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. తేమ లేమికి గురవుతున్న ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రతి నీటి వనరునూ సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడేందుకు రక్షక తడులు అందించాలని వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన చోట తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో జూన్ 1 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాధారణంగా 476.1 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 218.2 మి.మీ. మాత్రమే నమోదైందని మంత్రికి అధికారులు వివరించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 54.2 శాతం వర్షపాతం లోటు నమోదైందన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వర్షాభావ ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

ఖరీఫ్-2026లో సెప్టెంబర్ 12 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 26.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని అధికారులు తెలిపారు. ఇది సాధారణ సాగు విస్తీర్ణంలో 74 శాతం కాగా, గత ఏడాది ఇదే తేదీ నాటి సాగుతో పోలిస్తే 78 శాతంగా ఉందన్నారు. ప్రధాన పంటల్లో వరి 12.01 లక్షల హెక్టార్లు, పత్తి 4.11 లక్షల హెక్టార్లు, కంది 2.63 లక్షల హెక్టార్లు, వేరుశనగ 1.47 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.08 లక్షల హెక్టార్లలో సాగైనట్లు వివరించారు.

రాష్ట్రంలోని 284 మండలాలు, 1,792 ఆర్ఎస్కేలు/గ్రామాల పరిధిలో పంటలపై ఎల్-నినో ప్రభావం ఉన్నట్లు సమావేశంలో అధికారులు వెల్లడించారు. మొత్తం 2,44,443 హెక్టార్లలో పంటలు వివిధ స్థాయుల్లో ప్రభావితమైనట్లు తెలిపారు. ఇందులో 1,92,387 హెక్టార్లలో తేమ ఒత్తిడి, 41,474 హెక్టార్లలో పంటలు వాడిపోవడం, మరో 10,582 హెక్టార్లలో పంటలు ఎండిపోవడం నమోదైనట్లు వివరించారు.

ఈ పరిస్థితిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ తేమ ఒత్తిడిలో ఉన్న పంటలను సాధ్యమైనంత వరకు కాపాడటమే ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందించాలని, అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.

జిల్లాల వారీగా కర్నూలు జిల్లాలో అత్యధికంగా 1,09,255 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 80,751 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 32,456 హెక్టార్లలో పంటలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వ్యవసాయ, జలవనరుల శాఖల అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పంటల వారీగా కంది 74,301 హెక్టార్లు, పత్తి 73,733 హెక్టార్లు, వేరుశనగ 25,818 హెక్టార్లు, మొక్కజొన్న 24,819 హెక్టార్లు, వరి 18,443 హెక్టార్లలో ప్రభావితమైనట్లు సమావేశంలో వివరించారు.

### 99.76 శాతం ప్లాట్ల సర్వే పూర్తి

ఈ-పంట, ఎం అండ్ ఈ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2.7558 కోట్ల ప్లాట్లలో 2.7493 కోట్ల ప్లాట్ల సర్వే పూర్తయిందని, తద్వారా 99.76 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 65,233 ప్లాట్లు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన సర్వేను కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. పంట ఆరోగ్య వివరాలకు సంబంధించి 1.082 కోట్ల ప్లాట్లలో వివరాలు నవీకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 98.10 లక్షల ప్లాట్లలో నవీకరణ పూర్తయిందని అధికారులు వివరించారు. ఇంకా 10.10 లక్షల ప్లాట్లు, అంటే 9.34 శాతం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ పంట ఆరోగ్య వివరాల నమోదు కేవలం గణాంకాల కోసం కాకుండా, ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎలాంటి సమస్య ఉందో గుర్తించి సకాలంలో రైతుకు సహాయం అందించేందుకు అత్యంత కీలకమన్నారు. ప్రతి ప్లాట్‌లో పంట ఆరోగ్యాన్ని పర్యవేక్షించి, పెండింగ్‌లో ఉన్న వివరాల నవీకరణను వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఇప్పటివరకు 34,567 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు చేపట్టినట్లు అధికారులు వివరించగా, ఇంకా 95,112 హెక్టార్లను కవర్ చేయాల్సి ఉందన్నారు. తక్కువ నీటి అవసరమయ్యే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను గుర్తించి రైతులను ప్రోత్సహించాలని మంత్రి ఆదేశించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సహా అవసరమైన సహకారం అందుబాటులో ఉంచాలని సూచించారు.

### వ్యవసాయ-జలవనరుల శాఖల మధ్య నిరంతర సమన్వయం

తేమ ఒత్తిడికి గురైన పంటలకు అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగించి రక్షక తడులు అందించడంపై వ్యవసాయ, జలవనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఏ ప్రాంతంలో పంటకు నీరు అత్యవసరమో గుర్తించాలి. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యతా క్రమంలో వినియోగించాలి. సాధ్యమైన ప్రతి పంటను కాపాడాలి. రైతుకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా క్షేత్రస్థాయిలో కనిపించాలి అని మంత్రి స్పష్టం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల కింద సాగు చేసే రైతులు వరికాకుండా ఆరుతడి పంటలను పండించాలని నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎల్-నినో పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ రైతుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

ఈ ఉన్నతస్థాయి సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, వ్యవసాయ-సహకార శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాజుని కుమారి, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, జలవనరుల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్, జలవనరుల శాఖ కార్యదర్శి, వ్యవసాయ, జలవనరుల శాఖలకు చెందిన వివిధ విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి విధ్వంసక గొడ్డలి పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పాలి

- మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపు
- చించినాడలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ
- ప్రజల ఆశీర్వాదంతోనే సేవ చేసే అవకాశం వచ్చిందన్న మంత్రి



పాలకొల్లు/ఎలమంచిలి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్లలో పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ నాయకులు ఓర్వలేక అడ్డంకులు సృష్టిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఇటువంటి ప్రతికూల రాజకీయాలు చేసే వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం ఎలమంచిలి మండలం చించినాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో విశాఖపట్నం దేవి ఫిషరీస్ సీఎస్ఆర్ నిధులతో 6, 7 తరగతుల విద్యార్థులకు ఉచిత సైకిళ్లను ఆదివారం పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు సిమెంట్ రోడ్లు నిర్మిస్తుంటే, విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందిస్తుంటే ఎందుకంటూ విమర్శలు చేయడం విచారకరమన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కావాలా.. అభివృద్ధిని అడ్డుకునే నాయకులు కావాలా.. అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలన్నారు. అటువంటివారు ఎన్నికల పేరుతో మీ ఇంటికి, మీ ఊరుకు వస్తే నిలదీయాలన్నారు.

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ తనకు ఉన్న పరిచయాలు, అవకాశాలను వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తున్నానన్నారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు దశలవారీగా ఉచిత సైకిళ్లు అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం మంత్రిగా సేవ చేసే అవకాశం ప్రజల నమ్మకం, ఆశీర్వాదాల వల్లే లభించిందన్నారు. ఆ రుణం తీర్చుకునేందుకు ఎమ్మెల్యే, మంత్రి అనే అహంకారం లేకుండా అహర్నిశలు ప్రజల కోసం పనిచేస్తున్నానని చెప్పారు. రాజకీయాల్లోకి రాకముందే అంబేద్కర్, మదర్ థెరిసా స్ఫూర్తితో 2005లో అధ్యాపకుడిగా ఉన్న సమయంలో తన తండ్రి పేరిట ధర్మారావు ఫౌండేషన్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. వందమంది వృద్ధులు, దివ్యాంగులను దత్తత తీసుకుని ప్రతి నెలా బియ్యం, వస్త్రాలు, వైద్య సహాయం అందిస్తున్నట్లు వివరించారు. ప్రజాసేవకు ఎమ్మెల్యే, మంత్రి పదవి తోడవడంతో మరింత విస్తృతంగా సేవ చేసే అవకాశం కలిగిందన్నారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు రుద్రరాజు సత్యనారాయణరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కబడ్డీ, కొడవటి వరబాబు, పీతల శ్రీనివాస్, కడలి గోపాలరావు, రావూరి వెంకట అప్పారావు, ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, ఎంవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు ఎస్. రామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలతో ముచ్చటించిన మంత్రి

సైకిళ్లు అందజేసిన అనంతరం మంత్రి విద్యార్థులను సైకిళ్లు బాగున్నాయా? అని అడగగా, వారు "థ్యాంక్స్ మంత్రి గారు" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పిల్లలతో కొంతసేపు ముచ్చటించారు. తొలుత మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

# కేంద్రం దృష్టికి తపాలా సేవకుల సమస్యలు

## విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హామీ




విజయనగరం (చైతన్యరథం): గ్రామీణ తపాలా సేవకుల వేతన, సేవా సంబంధిత సమస్యలను 8వ కేంద్ర వేతన సంఘం పరిధిలోకి తీసుకురావడంతో పాటు, వారి సమస్యలపై ప్రత్యేక జ్యుడీషియల్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా సేవకుల యూనియన్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ప్రతినిధులు విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రం సమర్పించారు. దేశవ్యాప్తంగా సుమారు 2.90 లక్షల మంది గ్రామీణ తపాలా సేవకులు గ్రామీణ ప్రాంతాల్లో తపాలా పంపిణీ, పోస్టల్ సేవలు, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, ఆధార్ ఆధారిత సేవలు, వివిధ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలకంగా సేవలందిస్తున్నారని యూనియన్ ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఉద్యోగుల వేతనాలు, అలవెన్సులు, సేవా పరిస్థితులు, సామాజిక భద్రత తదితర న్యాయబద్ధమైన అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు, 8వ కేంద్ర వేతన సంఘం పర్యవేక్షణలో ప్రత్యేక స్వతంత్ర జ్యుడీషియల్ కమిటీని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వారి న్యాయబద్ధమైన డిమాండ్లను సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో వందశాతం విజయమే లక్ష్యం

## శ్రేణులకు విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పిలుపు




విజయనగరం (చైతన్యరథం): పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ లంక శ్యామల రావుతో కలిసి రణస్థలం మండల కేంద్రంలోని వారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ క్యాడర్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం టీడీపీ శ్రేణులను ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో సమన్వయంతో పనిచేస్తూ 100 శాతం స్ట్రైకింగ్ రేటుతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. “రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం” అనే అంశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఎంపీ దిశానిర్దేశం చేశారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికల్లో విజయం ఢంకా మోగించాలని పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.



ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్, విశాఖ పశ్చిమ శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు)ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు ఆయనకు సాదరంగా స్వాగతం పలికి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఇరువురు నేతలు స్థానిక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గ అంశాలపై కొద్దిసేపు చర్చించారు. ప్రజాసేవలో షరీఫ్ కనబరుస్తున్న నిబద్ధతను గణబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, నియోజకవర్గ ముఖ్య ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

ఎల్.కోట (చైతన్యరథం): క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమీక్షా సమావేశం జరిగింది. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంపై దిశానిర్దేశం చేశారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, ప్రజల గొంతుకై నిరంతరం పనిచేస్తూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరం కలిసికట్టుగా అడుగులు వేద్దామని నిర్ణయించారు.

## కాకినాడలో స్థానిక ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం

కాకినాడ (చైతన్యరథం): టీడీపీ కాకిరాడ జిల్లా కార్యాలయంలో కూటమి పార్టీల నేతల సమావేశం జరిగింది. జిల్లా ఇంచార్జి మంత్రి నారాయణ,జిల్లా పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, ఎలక్షన్ ఇంచార్జి సుజయ్ కృష్ణ రంగారావు, ఇతర నాయకులు హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మూడు పార్టీల సమన్వయం పై ప్రధానంగా చర్చ జరిగింది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు, సీట్ల కేటాయింపులపై చర్చించారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులే గెలిచేలా ముందుకెళ్లాలని నిర్ణయించారు. మూడు పార్టీల నాయకులు కలిసికట్టుగా ప్రచారం నిర్వహించాలని నిర్ణయం జరిగింది. ఎక్కడైనా విభేదాలు ఉంటే వెంటనే సమన్వయ కమిటీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని నేతలకు మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఎన్డీయే జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు జనసేన మేడిశెట్టి సూర్యకిరణ్ (కత్తిపూడి బాబీ), బుర్రా దివ్య రాజ్, మల్లాది రాజేంద్ర ప్రసాద్, బిక్కిన విశ్వేశ్వరరావు, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.



# పేదల పాలిట వరం సీఎం సహాయనిధి

## సీఎం ఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట (చైతన్యరథం): నరసన్నపేట మండలం, ఉర్లాం గ్రామానికి చెందిన నడిమింటి దుర్గారావు గారు గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ, వైద్య చికిత్స కోసం బాధితుని వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 1,17,700/- (లక్ష పదిహేడు వేల ఏడు వందల రూపాయలు) చెక్కును పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో శాసనసభ్యుడు బగ్గు రమణమూర్తి లబ్ధిదారునికి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన బాధితులందరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేసినందుకు బాధితుని కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి గారికి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ డోల జగన్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి జల్లు చంద్రమౌళి , మండల తెలుగు రైతు అధ్యక్షులు ఆర్.బి. రామన్న,మండల పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి జల్లు గోపాలం తదితరులు పాల్గొన్నారు.



# 17న మంత్రి లోకేశ్ పర్యటన విజయవంతం చేయాలి

## కేడర్‌కు పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపు



పెడన (చైతన్యరథం): ఈ నెల 17వ తేదీన కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ పెడన నియోజకవర్గ పర్యటన, కేడర్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పెడన నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి , పెనమలూరు శాసనసభ్యుడు, బోడె ప్రసాద్ పాల్గొననున్నారని తెలిపారు. 17వ తేదీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, నియోజకవర్గంలోని ప్రతి మండలం, గ్రామం, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా ముందస్తుగా సమన్వయం చేసుకోవాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సూచించారు. తమకు అప్పగించిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ సమర్థవంతంగా నిర్వహించాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కేడర్ సమావేశానికి భారీగా జనసమీకరణ చేపట్టాలని అన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపును ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని, 17వ తేదీన పెడన నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కేడర్ ఐక్యత, క్రమశిక్షణ, బలాన్ని రాష్ట్రానికి చాటేలా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. నారా లోకేష్ పర్యటనను ఘనంగా స్వాగతించి... కేడర్ సమావేశాన్ని పది కాలాలు గుర్తుండి పోయేలా విజయవంతం చేయాలని కోరారు.

# వెలుగొండ నిర్వాసితులకు అండగా కూటమి ప్రభుత్వం

## త్యాగధనులకు పాదాభివందనం చేసిన ఎమ్మెల్యే ముత్తుముల



మార్కాపురం (చైతన్యరథం): పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితులకు మార్కాపురంలోని ఎస్వీ కేపీ కాలేజ్‌లో అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణానగర్, శ్రీరాంనగర్, రామలింగేశ్వరపురం గ్రామాల నిర్వాసితులకు నిర్వహించిన ఇళ్ల పట్టాలు, చీరలు, నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యేమాట్లాడుతూ నల్లమల్ల జలాశయానికి, కాకర్ల డ్యాంకు సంబంధించి సర్వస్వం కోల్పోయిన రైతులకు, కుటుంబాలకు పాదాభివందనం చేశారు. 11 గ్రామాల ప్రజలు త్యాగం చేయబట్టి వెలుగొండ ప్రాజెక్టు అనేది నిర్మించడం సాధ్యమైందని అన్నారు. దీని ద్వారా 7000 కుటుంబాలు, 4,35,000 ఎకరాలకు 23 లక్షల మందికి త్రాగునీరు అందుతుందన్నారు. గతం మాదిరి కాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సెటిల్ మెంట్ ద్వారా వేగవంతంగా పూర్తి చేశారన్నారు. త్వరలోనే మీ నిర్వాసితులకు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో చేయవలసిన అభివృద్ధికి అధికారులతో కలిసి వచ్చి మీ పనులను నిర్మాణాన్ని వేగవంతం చేయిస్తానని పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా సహాయం అందించి అండగా ఉంటానని హామి ఇచ్చారు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారి పునరావాసం, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపడుతుందని నిర్వాసిత కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందించడంతో పాటు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేయడం ద్వారా వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నిర్వాసిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# 150 వసంతాల ఒంగోలు పురపాలక సంఘం

## నగరమంతా ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు మున్సిపాలిటీగా ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు ఆదివారం ఒంగోలు నియోజకవర్గ పరిధిలో 150 ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ముందుగా స్థానిక 4వ డివిజన్ ఇస్లాంపేటలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రోగులకు అందుతున్న సేవలపై వైద్యులకు, సిబ్బందికి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు మున్సిపాలిటీ ఏర్పడి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించిన ప్రజలకు 150 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 119 ప్రైవేట్ హాస్పిటల్స్ వారి సహకారంతో 680 మంది వైద్య సిబ్బంది ఉచితంగా వైద్యం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. సుమారుగా వైద్య శిబారాలకు 9567 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జనార్ధన్ గారు మాట్లాడుతూ ఒంగోలు మున్సిపాలిటీ అభివృద్ధిలో నగర ప్రజల కృషి ఎంతో ఉందని, వారు ఆరోగ్యంగా.. సంతోషంగా ఉండాలనే తన అభిలాష అని ఆయన పేర్కొన్నారు. 150 వైద్య శిబిరాలలో ఎక్కడ ఎలాంటి చిన్న పొరపాటు కు తావు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. సోమవారం వినాయక చవితి పండగ ఉన్నా ఈ వైద్య శిబిరం ఏర్పాటులో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ తో పాటు 119 హాస్పిటల్స్, వారి సిబ్బంది అందించిన సహకారానికి తన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలిపారు.



# విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రజలకు శుభం జరగాలి : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలనలో ప్రజలకు నిత్య సంతోషం, రాష్టంలో తిరుగులేని అభివృద్ధిని చూస్తున్నామని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. ఈ ప్రజా రంజక పాలన పదికాలాలు ఉండాలని, భావితరాలకు ఉజ్వల భవిష్యత్ అందించే మహా యజ్ఞం సఫలం చేయాలని ఆ సంకట హరుని వేడుకుంటున్నానన్నారు. ప్రతి ఇంటా ఆనందం, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని... చేపట్టే పనులన్ని విజయవంతమై కార్యసిద్ధి కలగాలని...ప్రతి ఒక్కరి హృదయం భక్తిభావం, శాంతి, స్నేహం, సహనంతో నిండిపోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అంతులేని ఆనందం, ఆరోగ్యం, సుఖసంతోషాలు, సిరిసంపదలు, సంక్షేమం చేకూరాలని ఆ పార్వతి పుత్రుని నిండుమనసుతో వేడుకుంటున్నానన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, మహిళలు, యువతతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ అభివృద్ధి, ఆనందం, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుని వేడుకుంటున్నానన్నారు. సర్వ విఘ్నాలను తొలగించి, సకల శుభాలను ప్రసాదించే శ్రీ విఘ్నేశ్వరుని దివ్య అనుగ్రహం, కృపాకటాక్షాలు, ప్రజలందరిపై సదా ఉండాలని మనస్ఫూర్తిగా ఆ గణ నాధుని ప్రార్ధిస్తూ...ప్రజలకు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ శ్రేణులకు, అభిమానులకు హృదయపూర్వక వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు చేస్తున్నానన్నారు.



తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోరంకి గ్రామంలో విష్ణుపురం కాలనీలో వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులకు రూ. 5 లక్షల జనరల్ ఫండ్‌ను కేటాయించి పనులు ప్రారంభించేలా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ చర్యలు చేపట్టారు

# సీఎం సాయం అందజేత

పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీ బోడే ప్రసాద్ గారి ఆదేశాల మేరకు, నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.4,95,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి పత్రాలను తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిచ్చింది,ప్రజల అవసరాలను గుర్తించి,అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి,ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ,ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.



# గణపతి ఉత్సవాలతో బందరుకు ఆధ్యాత్మిక, పర్యాటక శోభ

**మంగినపూడి సాగరతీరంలో భారీ ఎత్తున నవరాత్రి వేడుకలు, కట్టుదిట్టంగా ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, సీఎం గవర్నర్ రానున్న నేపథ్యంలో ఘనంగా ఏర్పాట్లు, బందరు అంటే పర్యాటకం, పరిశ్రమలు అనేలా చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర భరోసా**







మచిలీపట్నం సముద్ర తీరాన్ని దేశంలోనే ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక, కళా క్షేత్రంగా మార్చి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడుతూ.. మంగినపూడి సాగరతీరం గణపతి నవరాత్రులతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోబోతోంది. లోక కల్యాణార్థం 63 అడుగుల మహా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మహాగణపతి ఆలయంతో పాటుగా తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ ఇంద్రకీలాద్రి ఆలయం, సింహాచలం వరాహనరసింహస్వామి వారి దేవాలయం, భద్రాద్రి రాముల వారి నమూనా ఆలయాలు, ప్రచార రథాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సాగరతీరంలో హోమాలు ఏర్పాటు చేసుకుని మంత్రోచ్ఛారణలతో అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కుల మత ప్రాంతాలకు అతీతంగా భక్తులంతా హాజరవుతుండడం ఆనందం. పర్యాటక రంగం, దేవాదాయ శాఖ నుండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయం.

కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. ప్రత్యేకంగా ట్రాఫిక్ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాంతం మొత్తాన్ని వన్ వే చేశాం. తద్వారా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకమూ ఎదురవకుండా చర్యలు తీసుకున్నాం. ఏపీలోనే మొట్టమొదటి సారిగా ఈ ప్రాంతం మొత్తంలో భారీ ఎత్తున లైటింగ్ ఏర్పాటు చేశాం. సముద్రతీరంలో లైట్లు, వాచ్ టవర్స్ ఏర్పాటు చేశాం. ప్రజలకు తాగునీరు, ఆహారం, మందులు అందుబాటులో ఉంచాం. కార్యక్రమానికి ముఖ్యమంత్రిగారు, గవర్నర్ గారు సహా ఎంతో మంది ప్రముఖులు హాజరవుతారు. ప్రతి ఇంటి నుండి మట్టి సేకరించాలనే పిలుపు మేరకు విగ్రహ నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఖైరతాబాద్ విగ్రహం నిర్మాణం చేపట్టే నిపుణులతోనే నిర్మించడం జరిగింది. సముద్రతీరంలో హోమ గుండాలు ఏర్పాటు చేశాం. కర్నాటక నుండి వచ్చే కొంత మంది పీఠాధిపతులతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ వేగంగా పూర్తవడంతో పాటుగా, ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక పర్యాటక పారిశ్రామిక శోభ కలిగేలా కార్యక్రమాలు చేపట్టాం. ఈ ప్రాంతాన్ని పర్యాటక అభివృద్ధికి అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా ఈ ప్రాంతంలో రూ.100 కోట్లతో పెట్టుబడులు రాబోతున్నాయి. పర్యాటకులు వచ్చి వెళ్లేలా కాకుండా.. ఇక్కడే ఉండేందుకు వీలుగా కొన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. సుమారు 750 ఎకరాలను గుర్తించాం. వాటిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ఆ భూముల్ని పర్యాటకంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. గోల్ఫ్ కోర్ట్, ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో స్టూడియోల నిర్మాణం సహా అనేక పెట్టుబడులు రాబోతున్నాయి. స్పీడ్ బోట్స్, పారా గ్లైడింగ్ లాంటి వినోద కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. పది రోజుల పాటు జరిగే వేడుకల అనంతరం జెట్ స్ప్రింక్లర్స్ ద్వారా స్వామి వారి నిమజ్జనం జరుగుతుంది. ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల్సిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. ఈ ఉత్సవాన్ని ఇలాగే ప్రతి సంవత్సరం కొనసాగించడంతో పాటుగా, స్థానిక కార్యక్రమాల నిర్వహణకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం బీచ్ ఫెస్టివల్ సహా వారాంతంలో కూడా వినోద కార్యక్రమాలు నిర్వహిస్తాం. మచిలీపట్నం సముద్రతీరంలో నిరంతరం ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ.. పర్యాటక శోభ తీసుకొస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే యార్లగడ్డ వినాయక చవితి శుభాకాంక్షలు



గన్నవరం (చైతన్యరథం): వినాయక చవితి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు గన్నవరం నియోజకవర్గ ప్రజలందరికీ ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. ఏ శుభకార్యానికైనా తొలి పూజ విఘ్నేశ్వరుడికే చేయడం భారతీయ సంప్రదాయమని పేర్కొన్నారు. మహా గణాధిపతి అనుగ్రహంతో ప్రజలందరి కోరికలు నెరవేరాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని... ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టితో తయారు చేసిన సహజ వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మట్టి గణపతులను పూజిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరిస్తున్న వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.




# అభివృద్ధికి చిరునామా ఉమాకు, పనికిమాలిన మల్లాదికి పోలికా!

## టీడీపీ మహిళా నేతలు ఫైర్

విజయవాడ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యు కార్యాలయంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, మాజీ కార్పొరేటర్ పిరియ జగదాంబ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి గౌసియా, నియోజకవర్గ మహిళా కార్యదర్శి దొండపాటి సుల్తానా నిన్న మాజీ డిప్యూటీ మేయర్ శైలజ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు విశ్వసనీయత లేని నాయకుల మాటలను ప్రజలు ఇక నమ్మే పరిస్థితిలో లేరని మహిళా నాయకులు దాసరి ఉదయశ్రీ, పైడి తులసి అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకుడు ఎవరో, కేవలం మాటలు చెప్పే నాయకుడు ఎవరో సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు స్పష్టంగా తెలుసన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ శైలజారెడ్డిని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నామని, 2024 ఎన్నికల సమయంలో ప్రజల్లో తిరిగి సేవ చేశామని, సెంట్రల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని చెబుతున్న మీ నాయకుడు మల్లాది విష్ణుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు టికెట్ ఇవ్వలేదో సమాధానం చెప్పాలని దాసరి ఉదయశ్రీ ప్రశ్నించారు. మల్లాది విష్ణుకు టికెట్ ఇవ్వకపోతే జగన్‌మోహన్‌రెడ్డిని ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రజలకు మంచి సేవ చేశారని మీరు చెబుతున్నప్పుడు సొంత పార్టీ ఎందుకు ఆయనకు టికెట్ నిరాకరించిందో ప్రజలకు వివరించాలన్నారు. నందమూరి నగర్ ప్రజల చిరకాల వాంఛ అయిన ఇళ్ల పట్టాలు ఇస్తామని గతంలో హామీ ఇచ్చి ఓట్లు అడిగారని, ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మల్లాది విష్ణు నాయకత్వంలో శైలజారెడ్డి డిప్యూటీ మేయర్‌గా ఉన్నప్పటికీ ఎందుకు పట్టాలు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. బోండా ఉమామహేశ్వరరావు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే ఇళ్ల పట్టాల సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని అర్హులకు పట్టాలు అందించారని తెలిపారు. మధురానగర్ ఆర్‌యూబీ, వాంబే కాలనీలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్, గద్దె వెంకట్రామయ్య నగర్‌లో వాటర్ ట్యాంక్ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని మహిళా నాయకులు తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో సుమారు రూ.650 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రూ.100 కోట్ల అంచనా వ్యయంతో 316 ఆర్‌యూబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతులు తీసుకువచ్చేందుకు కృషి చేశామని పేర్కొన్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధిపై బోండా ఉమా ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. బోండా ఉమా ప్రజా సేవపై విమర్శలు చేస్తున్న వారు గత ఐదేళ్లలో ఏం చేశారో ముందుగా ప్రజలకు చెప్పాలని పైడి తులసి అన్నారు. తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు, టిఫిన్ బండ్లు, డబ్బా కొట్లు, ఆటోలు వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలకు సహాయం అందిస్తున్నామని ప్రతిపక్ష నాయకులే అంగీకరిస్తున్నారని తెలిపారు. అంటే గతంలో తమ నాయకుడు మల్లాది విష్ణు ఇవి ఎందుకు అందించలేదో స్పష్టమవుతోందని అన్నారు. బోండా ఉమామహేశ్వరరావు ఎవరి దగ్గరా దోచుకునే రకం కాదని, దాచుకునే రకం కూడా కాదని, ప్రజలకు అవసరమైన సమయంలో తన వంతు సహాయం అందించే నాయకుడని పైడి తులసి పేర్కొన్నారు. బోండా ఉమా గారితో పాటు ఆయన కుమారులు బోండా సిద్ధార్థ, బోండా రవితేజలు కూడా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో పీ-4 విధానంలో భాగంగా ప్రజలకు సహాయం అందిస్తున్నారని తెలిపారు. తమ కార్యాలయానికి సహాయం కోసం వచ్చిన ప్రతి ఒక్కరికీ తమ వంతు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఐదేళ్ల పరిపాలనలో పేదలకు కనీసం రూ.2 వేలతో ఒక ఇస్త్రీ పెట్టి ఇచ్చిన సందర్భం ఉందా అని శైలజారెడ్డిని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేశామని చెప్పుకునే ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. బోండా ఉమా చేసిన అభివృద్ధి, ప్రజా సేవపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తమ వేదికైనా, ప్రతిపక్ష వేదికైనా, ఉమ్మడి వేదికైనా సరే అభివృద్ధి అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని దాసరి ఉదయశ్రీ, పైడి తులసి తెలిపారు. మల్లాది విష్ణు గానీ, శైలజారెడ్డి గానీ, వారి పార్టీ నాయకులు గానీ ఎవరైనా సరే ప్రజల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. మాటలతో కాకుండా ఆధారాలతో అభివృద్ధి పనులపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.





# దేశానికే తలమానికంగా నెల్లూరు గణేశ్ ఘాట్ నిర్మాణం

## 18వ తేదీ సాయంత్రం వేదపండితుల ఆధ్వర్యంలో గంగాహారతి, మంత్రి ఆనం, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని గణేష్ ఘాట్‌లో వివిధ శాఖల అధికారులతో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఏర్పాట్లును వివరించారు. సింహపురికి మంచి పేరు ప్రతిష్టలు ఆధ్యాత్మికంగా సింహపురి ప్రతిష్ఠతను రాష్ట్రంలో ఇమడింపచేసే విధంగా మంత్రి నారాయణ, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభకర్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. గణేష్ ఘాట్‌లో చివరి రోజు నెల్లూరు ప్రజలందరూ పాల్గొని, ఆధ్యాత్మిక వాతావరణంలో భాగస్వామ్యులు అవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలతో గణేష్ ఘాట్‌లో శాశ్వత ఘాట్ ను నిర్మించి తీరుతామన్నా నిమజ్జనమైన 15 రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా శ్రీకారం చుడతామన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. మంత్రి నారాయణ గారు గణేష్ ఘాట్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు నిధుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో విక్రమ సింహపురి సేవాసమితి సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దర్శికి తరలి వచ్చిన సాగర్ జలాలు

## డాక్టర్ లక్ష్మి కృషితో తాగునీటి అవసరాలకు అసరా

దర్శి (చైతన్యరథం): దర్శి టీడీపీ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కృషితో త్రాగు నీటికి అవసరమైన సాగర్ జలాలను దర్శి నియోజకవర్గానికి రప్పించేందుకు చేసిన కృషి ఫలించింది. సంబంధిత నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ రాజబాబు, ఎన్నెస్పీ అధికారులతో డాక్టర్ లక్ష్మీ పలు మార్లు మాట్లాడి చేసిన కృషి ఫలించింది. ఆదివారం సాయంత్రం నియోజకవర్గంలోని రాజానగరం, మోదేపల్లి మేజర్ కాలువల్లో సాగర్ జలాలు ప్రవేశించడం శుభపరిణామం అన్నారు. విడుదలైన సాగర్ జలాలు ద్వారా నియోజకవర్గంలోని త్రాగు నీటి అవసరమైన ట్యాంక్‌లు నింపుకననేందుకు ఇది మంచి సదవకాశం అన్నారు. ఎల్నీనో ప్రభావంతో తీవ్ర వర్షభావ పరిస్థితులు ఏర్పడి త్రాగు నీటికి ఇబ్బందులు ఏర్పడ్డ ఈ పరిస్థితుల్లో సాగర్ జలాలు విడుదల చేయడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్, సాగర్ కెనాల్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ సాగర్ జలాలను కేవలం త్రాగు నీటికే వాడుకోవాలని వృధ చేయవద్దని ఆమె విజ్ఞప్తి చేసారు.

# అగస్త్యేశ్వరునికి పల్లకీ వితరణ : ఎమ్మెల్యే నజీర్

పాత గుంటూరు (చైతన్యరథం): అగస్త్యేశ్వరస్వామి దేవస్థానానికి ఆలయ చైర్మన్ గాలి సతీష్ బాబు ఆధ్వర్యంలో పల్లకి వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ తొలుగ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పల్లకిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎంతో ప్రాసత్యం కలిగిన అగస్త్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి చైర్మన్ గాలి సతీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించాలని సూచించారు. కమిటీ సభ్యులు కలిసికట్టుగా ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి, పరిరక్షణకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఆలయాల్లో దీప, దూప నైవేద్యాలతోపాటు అర్చకుల గౌరవ వేతనం పెంచినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధితోపాటు అవసరమైన చోట పునర్నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు.





# అపరభగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు

## ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పశ్చిమ టీడీపీ శ్రేణులకు వెలిగొండ, శ్రీశైలం టూర్



గుంటూరు (చైతన్యరథం): ప్రకాశం, రాయలసీమలను కొనసీమగా మార్చగల నాయకుడు వాటర్ మ్యాన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అపరభగీరథుడు నారా చంద్రబాబు నాయుడు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక ప్రోత్సాహకంగా వెలిగొండ ప్రాజెక్టు, శ్రీశైలం దేవస్థానం పర్యటనను ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీనివాసరావుపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి 10 బస్సులను ప్రారంభించారు. ఈ పర్యటనలో సుమారు 450 మంది కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన కార్యకర్తలు ప్రధాన టన్నెల్ ప్రాంతం, నీటి ప్రవాహ మార్గాలు, ఫీడర్ కాలువలు, 40 కిలోమీటర్ల ప్రధాన కాలువ వ్యవస్థతో పాటు ప్రాజెక్టు నిర్మాణ విశేషాలను పరిశీలించారు. కరువు ప్రాంతాలకు జీవనాడిగా మారిన ఈ ప్రాజెక్టు ద్వారా చేరుతున్న నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీశైలం క్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు అత్యంత బాధ్యతతో నిర్వహించారని తెలిపారు. కేవలం 20 రోజుల్లోనే కార్యక్రమాన్ని పూర్తి చేసి రాష్ట్రవ్యాప్తంగా 7వ స్థానంలో నిలవడం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతగా ఈ పర్యటన ఏర్పాటు చేశామని, అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదని, ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొచ్చే మహత్తర ప్రాజెక్టులేనని పేర్కొన్నారు. అందుకే అమరావతి కాకుండా వెలిగొండ ప్రాజెక్టును సందర్శనకు ఎంపిక చేశామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది కేవలం ఒక నీటిపారుదల ప్రాజెక్టు కాదని, అది చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి, పట్టుదల, ప్రజల పట్ల ఉన్న అంకితభావానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 1996లో శంకుస్థాపన జరిగిన ఈ ప్రాజెక్టు ఎన్నో అవరోధాలు ఎదుర్కొన్నప్పటికీ, చివరకు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోనే ప్రజలకు అంకితం కావడం చారిత్రాత్మక ఘట్టమన్నారు. లక్షలాది మంది ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. "వెలిగొండ అనేది ఒక సాధారణ ప్రాజెక్టు కాదు. ఇది మూడు దశాబ్దాల కల, వేలాది కుటుంబాల ఆశల ప్రతిరూపం. ఈ ప్రాజెక్టు వెనుక స్థానిక ప్రజల త్యాగం, ఇంజనీర్ల అంకితభావం, ప్రభుత్వ నిబద్ధత, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు గారి సంకల్పం ఉన్నాయి. అందుకే ప్రతి తెలుగు వ్యక్తి జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రాజెక్టును సందర్శించాలి" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నదుల అనుసంధానం, జల సంరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగంలో చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టి కారణంగానే ఆయనకు "ఆంధ్రప్రదేశ్ వాటర్ మ్యాన్", "అపర భగీరథుడు" అనే గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి కావడంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజనీర్లు, స్థానిక ప్రజలు, ముంపు గ్రామాల ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. ఈ పర్యటనలో పాల్గొన్న కార్యకర్తలు మాట్లాడుతూ, వెలిగొండ వంటి మహత్తర ప్రాజెక్టును ప్రత్యక్షంగా సందర్శించడం ద్వారా చంద్రబాబు నాయుడు గారి అభివృద్ధి దృక్పథం ఎంత విస్తృతమైనదో అర్థమైందన్నారు. రాష్ట్ర భవిష్యత్తును మార్చగలిగే ప్రాజెక్టుల వెనుక ఉన్న కృషి, సంకల్పాన్ని తెలుసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ పర్యటన తమలో మరింత ఉత్తేజాన్ని నింపిందని, పార్టీ బలోపేతం కోసం రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు.



# పర్యావరణహితంగా వినాయక చవితి

## ప్రతి ఇంటికీ మట్టి విగ్రహాన్ని అందజేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి శ్రీరామ్

రాప్తాడు (చైతన్యరథం): ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ తన స్వగ్రామం రామగిరి మండలం వెంకటాపురంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఇంటికీ మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. వెంకటాపురం తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఈ మట్టి



వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి అంటే ఎంతో సందడిగా చేసుకునే పండుగ అని... అయితే ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడటం వల్ల నీటి కాలుష్యం బాగా పెరిగిందన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించాలన్న లక్ష్యంతోనే ఈ విగ్రహాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. పండుగ అన్నది పర్యావరణాన్ని కాపాడే విధంగా ఉండాలన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం మట్టి వినాయక విగ్రహాలను గరికతో పూజించాలని, దీనిని ఎవరు మర్చిపోవద్దని సూచించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు వారు ప్రత్యేకంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

# స్థానిక ఎన్నికలపై సమన్వయ కమిటీ సమావేశం

## పాల్గొన్న అనంతపురం కూటమి పార్టీల ప్రతినిధులు



అనంతపురం (చైతన్యరథం): జిల్లా కేంద్రంలో కూటమి పార్టీల స్థానిక సంస్థల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల పరిశీలకులు, మాజీ మంత్రి ప్రతాపరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కాపు రామచంద్రారెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసులు, జనసేన పార్టీ నాయకులు జయరాం రెడ్డి, దేవరకొండ జయమ్మ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు.








పలు కార్యక్రమాలలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని టీడీపీ కార్యాలయం నందు డీజేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 4500 వినాయకస్వామి మట్టి ప్రతిమలు రత్నమహల్ థియేటర్, కొత్తపట్నం బస్ స్టాండ్, కర్నూల్ రోడ్ ఫ్లైఓవర్ ,బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్, కొత్త మార్కెట్ రంగారాయుడు చెరువులో ఏర్పాటు చేసిన వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు నందు నగర ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డ్‌లో వైసీపీ చెత్త డ్రామాలు

## నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ఎద్దేవా

నెల్లూరు (చైతన్యరథం): వైసీపీ నేతలు చేసిన ఆరోపణలను స్వయంగా నిరూపించి ఎండగట్టేందుకే చెత్త దిబ్బలతో నిండిపోయిన అల్లీపురం డంపింగ్ యార్డ్ స్థలంలోనే పత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశామని నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. నగరంలో ఉనికి కాపాడుకోవడానికే వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కాంపాక్టర్లు, బయో మైనింగ్‌పై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరమని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 1190 కోట్ల చెత్త తరలింపు ప్రాజెక్టుల్లో ఏకంగా 1200 కోట్ల అవినీతి జరిగిందనడం వైసీపీ నేతల అజ్ఞానానికి నిదర్శనమని, సంచలనం కోసమే బుధవారం వరకు డెడ్‌లైన్ నాటకాలు ఆడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో చెత్తపై పన్నులు వేసి ఊళ్లన్నీ చెత్తమయం చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 1.58 కోట్ల టన్నుల చెత్తను తొలగించే పని చేపట్టి 92శాతం పనులను పూర్తి చేసిందని వెల్లడించారు. అల్లీపురం యార్డ్‌లోని 80 వేల టన్నుల చెత్తను పూర్తిగా ఖాళీ చేశామని, దొంతాలి యార్డ్‌లోని 8 లక్షల టన్నులకు గాను 7 లక్షల టన్నుల బయో మైనింగ్ పూర్తి చేశామని తెలిపారు. జిగ్మా, జిందాల్ వంటి అంతర్జాతీయ ప్రసిద్ధి పొందిన సంస్థలతో ఈ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని, 2019-24 మధ్య ఒక్క వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ కూడా కట్టని వైసీపీకి విమర్శించే హక్కు లేదని, ఇప్పుడు నెల్లూరుతో సహా 5 కీలక నగరాల్లో శరవేగంగా ప్లాంట్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా, ఒక విద్యావేత్త అయి ఉండి వీఆర్సీ స్కూల్‌పై అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి నారాయణ చొరవతో నెల్లూరులోని 15 కార్పొరేషన్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పునర్నిర్మించిన ఆరెస్సార్ స్కూల్‌ను ఈ నెల 16న నారా లోకేష్ చేతుల మీదుగా పునఃప్రారంభిస్తున్నామన్నారు. ఫూలాపేట డీఎస్సార్ గర్ల్స్ స్కూల్‌ను కూడా అభివృద్ధి చేశామని వివరించారు. అల్లిపురం యార్డ్ ఖాళీ చేసిన 6.7 ఎకరాల స్థలంలో నెల్లూరు ప్రజల కోసం త్వరలోనే ఒక అద్భుతమైన అడ్వెంచర్ పార్క్‌ను అందుబాటులోకి తెస్తున్నామని, ఏ ఆధారాలు లేదా సమాచారం కావాలన్నా నేరుగా చర్చకు రావాలని వైసీపీ నేతలకు డిప్యూటీ మేయర్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడాల మధు, జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు స్థానిక టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు



## తరచూ విమాన ప్రయాణాలు చేస్తున్నారా..

# 20 టిప్స్ పాటిస్తే సేఫ్

- హోటల్ రూమ్‌లోకి వెళ్లగానే సూట్‌కేస్‌ను బాత్‌టబ్‌లో ఎందుకు పెట్టాలి? ఫ్లైట్ అటెండెంట్ చెప్పిన షాకింగ్ సీక్రెట్
- బెడ్‌బగ్స్ బారిన పడకుండా ఈ పని చేయాల్సిందే.. లగేజ్ భద్రతపై నిపుణుల అదిరిపోయే ట్రావెల్ హ్యాక్స్
- విమానం ఎక్కే ముందు సూట్‌కేస్‌ను ఫొటో ఎందుకు తీయాలి? బ్యాగేజీ డ్యామేజ్ అయితే నష్టపరిహారం పొందే ట్రిక్ ఇదే

విమాన ప్రయాణాలను, హోటల్ బసను మరింత సురక్షితంగా మార్చేందుకు ఫ్లైట్ అటెండెంట్లు పాటించే ఉత్తమమైన 20 ట్రావెల్ హ్యాక్స్ ఇవి. రూమ్‌లోకి వెళ్లగానే నల్లులు చేరకుండా లగేజీని బాత్‌టబ్‌లో పెట్టడం, లగేజ్ ఇచ్చే ముందు ఫొటోలు తీసుకోవడం, బట్టలు పాడవకుండా షవర్ క్యాప్స్..ప్లాస్టిక్ సీల్స్ వాడటం, మతిమరుపు వల్ల ముఖ్యమైన పాస్‌పోర్ట్, ఛార్జర్లు మర్చిపోకుండా ఉండే అలవాట్లు ప్రయాణాన్ని ఒత్తిడి లేకుండా సాఫీగా సాగేలా చేస్తాయి.

హోటల్ రూమ్‌లోకి అడుగుపెట్టగానే సూట్‌కేస్‌ను నేరుగా బెడ్‌పై లేదా కార్పెట్‌పై పడేయడం చాలామంది చేసే సాధారణ తప్పు. అయితే అనుభవం ఉన్న ఫ్లైట్ అటెండెంట్లు రూమ్‌లోకి వెళ్లగానే లగేజీ బ్యాగ్‌ను ముందుగా బాత్‌టబ్‌లో లేదా టైల్స్ ఫ్లోరింగ్ ఉన్న బాత్రూమ్‌లో ఉంచమని సూచిస్తున్నారు. హోటల్ పరుపులు, హెడ్‌బోర్డులలో ఉండే ప్రమాదకరమైన నల్లులు సూట్‌కేస్ జిప్పులు, దుస్తుల్లోకి చేరకుండా అడ్డుకోవడానికి ఈ ట్రిక్ ఎంతో ఉపయోగపడుతుంది. అమెరికా పర్యావరణ పరిరక్షణ సంస్థ సైతం బెడ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసుకునేంతవరకు లగేజీని బాత్‌టబ్‌లోనే ఉంచాలని సిఫార్సు చేస్తోంది.

### చెక్-ఇన్ చేసేముందు లగేజ్ ఫోటో- డ్యామేజ్ నష్టపరిహారానికి నిదర్శనం



విమానాశ్రయంలో ఎయిర్‌లైన్స్ కౌంటర్‌కు లగేజీని అప్పగించే ముందు బ్యాగ్‌ను నాలుగు వైపులా, చక్రాలు, హ్యాండిల్స్ స్పష్టంగా కనిపించేలా ఫొటోలు తీసుకోవడం మరొక కీలకమైన అలవాటు. ప్రయాణంలో విమాన సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బ్యాగ్ పగిలిపోయినా, చినిగిపోయినా నష్టపరిహారం క్లెయిమ్ చేయడానికి ఈ ముందస్తు ఫోటోలే అసలైన ఆధారాలుగా నిలుస్తాయి. అలాగే బ్యాగ్ తీసుకునేటప్పుడు ఇచ్చే బార్‌కోడ్ రసీదును కూడా ఫోటో తీసుకుని భద్రపరచుకుంటే బ్యాగ్ మిస్సయినప్పుడు వెతకడం సులువవుతుంది.

### దుస్తులు పాడవకుండా..స్థలాన్ని ఆదా చేసే ప్యాకింగ్ మెళకువలు



షూస్ అడుగుభాగంలో ఉండే మురికి బట్టలకు అంట కుండా ఉండేందుకు డిస్పోజబుల్ షవర్ క్యాప్‌లు తొడగడం ఉత్తమమైన పద్ధతి. అలాగే బరువు తగ్గించుకోవడానికి బూట్ల లోపలి ఖాళీ స్థలంలో సాక్స్‌లు, చిన్న వస్తువులను పెట్టుకోవచ్చు. ప్రయాణంలో శానిటైజర్లు, షాంపూ బాటిల్స్ ఒత్తిడికి లీక్ కాకుండా ఉండాలంటే క్యాప్ తీసి ప్లాస్టిక్ ర్యాప్ లేదా కవర్ పెట్టి మళ్లీ మూత బిగించాలి. దుస్తులను ఒకదానిపై ఒకటి పేర్చకుండా నిలువుగా లేదా ప్యాకింగ్ క్యూబ్స్‌లో సర్దుకుంటే వెతుక్కునే శ్రమ తప్పుతుంది.

### అత్యవసర ఔషధాలు/ఎమర్జెన్సీ దుస్తులు క్యారీ-ఆన్‌లోనే భద్రం

చాలామంది అన్ని వస్తువులతో పాటు అత్యవసర మందులను కూడా చెక్-ఇన్ లగేజ్‌లో వేసి ఇబ్బంది పడుతుంటారు. విమానం ఆలస్యమైనా లేదా చెక్-ఇన్ బ్యాగ్ దారితప్పినా ఇబ్బంది పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా వాడే మందులను తప్పనిసరిగా చేతిలో ఉండే క్యారీ-ఆన్ బ్యాగ్‌లోనే ఉంచుకోవాలి. దీంతో పాటు కనీసం ఒకరోజుకు సరిపడా అదనపు దుస్తుల జతను హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచుకుంటే లగేజీ మిస్ అయినప్పుడు కొత్త ఊర్లో బట్టల కోసం పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు.

### ఎయిర్‌క్రాఫ్ట్ సీట్ పాకెట్ పొరపాటు/ మతిమరుపు నివారణ ట్రిక్స్



ఫ్లైట్‌లో ప్రయాణించే సమయంలో సీట్ ముందుండే పాకెట్‌లో ఫోన్లు, పాస్‌పోర్టులు, పర్సులు ఎట్టిపరిస్థితుల్లో పెట్టవద్దని క్యాబిన్ క్రూ హెచ్చరిస్తున్నారు. దిగే ఆతురతలో వాటిని అక్కడే మరిచిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే హోటల్ గది నుంచి బయలు దేరేటప్పుడు లాకర్‌లో విలువైన వస్తువులు, ఫ్రిజ్‌లో మందులు లేదా ఛార్జర్లు మర్చిపోకుండా ఉండేందుకు గది తలుపు దగ్గర ఒక బూటును విడిగా పెడితే అది బయటకు వెళ్లేముందు అలర్ట్ చేస్తుంది. మొబైల్ ఫోన్‌లో అలారం పేరును "పాస్‌పోర్ట్, వాలెట్, ఛార్జర్" అని పెట్టుకోవడం వల్ల రూమ్ చెక్-అవుట్ సమయంలో కీలక పత్రాలను మర్చిపోకుండా చూసుకోవచ్చు.

# ఆస్ట్రేలియా విద్యార్థి వీసాలపై కఠిన నిఘా

- దశాబ్దంలోనే అత్యధిక రిజెక్షన్ రేటు
- భారత విద్యార్థులపై పెరిగిన ప్రభావం
- 2025-26లో 40 శాతానికి పైగా దరఖాస్తుల తిరస్కరణ





**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యను అభ్యసించాలని భావిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులకు వీసా ప్రక్రియ మరింత కఠినంగా మారుతోంది. విద్యార్థి వీసా దరఖాస్తులపై ఆస్ట్రేలియా ప్రభుత్వం తనిఖీలను గణనీయంగా పెంచింది. ఫలితంగా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు గత దశాబ్దంలో ఎన్నడూ లేనంత స్థాయికి చేరింది. ఆస్ట్రేలియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్ అఫైర్స్ గణాంకాల వివరాల ప్రకారం.. 2026 జూన్‌లో ఆస్ట్రేలియా విద్యార్థి వీసా దరఖాస్తుల్లో 24.2 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2016 జూన్‌లో ఈ రేటు కేవలం 7.9 శాతంగా ఉండటం గమనార్హం. అంటే పదేళ్ల వ్యవధిలో వీసా తిరస్కరణలు గణనీయంగా పెరిగాయి.

### భారత విద్యార్థులపై అధిక ప్రభావం

ఆస్ట్రేలియాలో చదువుకోవాలనుకునే భారతీయ విద్యార్థులు కూడా ఈ కఠినమైన వీసా పరిశీలనను ఎదుర్కొంటున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి వచ్చిన విద్యార్థి వీసా దరఖాస్తుల్లో 40 శాతానికి పైగా తిరస్కరణకు గురైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. నేపాల్ విద్యార్థుల పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఆ దేశం నుంచి వచ్చిన దరఖాస్తుల్లో సగానికి పైగా తిరస్కరణకు గురయ్యాయి. మరో వైపు చైనా విద్యార్థుల వీసా తిరస్కరణ రేటు 5.8 శాతంగా నమోదైంది. దేశాల వారీగా వీసా తిరస్కరణల్లో స్పష్టమైన తేడాలు కనిపిస్తున్నాయి.

### వీసా ఎందుకు తిరస్కరిస్తున్నారు?

అంతర్జాతీయ విద్యా వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించడంతో పాటు వలస వ్యవస్థలో నిబంధనలను కఠినంగా అమలు చేయడంలో భాగంగానే ఆస్ట్రేలియా ఈ చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా Genuine Student నిబంధనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఆస్ట్రేలియాలో చదువుకోవడానికి దరఖాస్తు చేసే వ్యక్తి నిజంగానే చదువుకోవాలనే ఉద్దేశంతో వస్తున్నాడా లేదా అన్నది అధికారులు పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థి స్వదేశంలోని పరిస్థితులు, ఆస్ట్రేలియాలో అతడి పరిస్థితులు, ఎంచుకున్న కోర్సు భవిష్యత్తు కెరీర్‌కు ఎంతవరకు ఉపయోగపడుతుంది, గతంలో ఉన్న ఇమిగ్రేషన్ రికార్డు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. దీంతో కేవలం ఆస్ట్రేలియాలో చదువుకోవాలనే ఆసక్తి ఉన్నట్లు చూపించడం మాత్రమే సరిపోదు. విద్యార్థి విద్యా నేపథ్యం, గత ఉద్యోగ అనుభవం, ఎంచుకున్న కోర్సు, భవిష్యత్తు కెరీర్ లక్ష్యాల మధ్య స్పష్టమైన సంబంధం ఉండటం ఇప్పుడు మరింత కీలకంగా మారింది.

### భారతీయ విద్యార్థులు ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?

ఆస్ట్రేలియా వీసాకు దరఖాస్తు చేసే భారతీయ విద్యార్థులు తమ స్టడీ ప్లాన్‌ను స్పష్టంగా రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో చదివిన కోర్సుకు భిన్నంగా కొత్త కోర్సును ఎంచుకుంటే దానికి సరైన కారణాన్ని వివరించగలగాలి. అలాగే ఎంచుకున్న కోర్సు భవిష్యత్తులో తమ కెరీర్‌కు ఎలా ఉపయోగపడుతుందో స్పష్టంగా తెలియజేయాలి. విద్యార్హతలు, పని అనుభవం, ఆర్థిక పరిస్థితులు, ఆస్ట్రేలియాలో చదువుకున్న తర్వాతి ప్రణాళిక వంటి వివరాల్లో పరస్పర విరుద్ధతలు ఉండకుండా జాగ్రత్త పడాలి. దరఖాస్తులో ఇచ్చే సమాచారం వాస్తవాలకు అనుగుణంగా ఉండటం కూడా అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది.

### నిబంధనలు పాటించని దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

వీసా తిరస్కరణ రేటు పెరగడం అనేది ప్రతి అంతర్జాతీయ విద్యార్థి దరఖాస్తును తిరస్కరిస్తున్నారనే అర్థం కాదని ఆస్ట్రేలియా ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. వలస చట్టాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. వీసా నిబంధనలను పాటించని లేదా తమ విద్యా ఉద్దేశాన్ని స్పష్టంగా నిరూపించలేని దరఖాస్తులపై ప్రస్తుతం మరింత కఠినంగా పరిశీలన జరుగుతోంది.

### ఆస్ట్రేలియా విద్యా రంగంలో ఆందోళన

విద్యార్థి వీసాలపై పెరుగుతున్న కఠిన నిబంధనలు ఆస్ట్రేలియా ఉన్నత విద్యా రంగంలోనూ ఆందోళనకు కారణమవుతున్నాయి. అధిక స్థాయి తనిఖీలు కొనసాగితే నిజంగా చదువుకోవాలనుకునే అంతర్జాతీయ విద్యార్థులు కూడా ఆస్ట్రేలియాను తమ విద్యా గమ్యస్థానంగా ఎంచుకోవడానికి వెనకడుగు వేసే అవకాశం ఉందని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు నిజమైన విద్యార్థులకు ఆస్ట్రేలియా అందుబాటులో ఉన్న గమ్యస్థానంగా కొనసాగడం కూడా ముఖ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతీయ విద్యార్థులు Genuine Student ప్రమాణాలకు అనుగుణంగా నిరూపించగలగడం వీసా ప్రక్రియలో కీలకంగా మారుతోంది.

# అమెరికాలో తెలుగు విద్యార్థికి జైలుశిక్ష

- చదువుకోవడానికి వెళ్లి కటకటాలపాలు
- మైక్రోసాఫ్ట్ ప్రతినిధుల పేరుతో భారీ మోసం
- ఫెడరల్ అధికారుల ముసుగులో వృద్ధుడికి టోకరా
- రెండోసారి డబ్బు కోసం వెళ్లి అడ్డంగా బుక్



**అమెరికా:** ఉన్నత చదువులు చదివి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనే కలలతో అమెరికా వెళ్లిన ఒక భారతీయ విద్యార్థి పెడదోవ పట్టి చివరకు కటకటాల పాలయ్యాడు. టెక్సాస్‌లోని శాన్ ఆంటోనియోలో స్టూడెంట్ వీసాపై నివసిస్తున్న వెంకటేశ్వర చాగంరెడ్డి అనే యువకుడు టెక్ సపోర్ట్ స్కామ్‌లో నిందితుడిగా తేలడంతో యూఎస్ కోర్టు అతనికి 30 నెలల జైలుశిక్ష విధించింది. మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ ప్రతినిధి పేరిట ఒక్లహోమాకు చెందిన ఒక వృద్ధుడిని మోసగించిన కేసులో అతన్ని దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం, జైలు శిక్షతో పాటు బాధితుడికి దాదాపు రూ.83 లక్షలు ($100,000 డాలర్ల పైమాటే) పరిహారంగా చెల్లించాలని, శిక్ష పూర్తయిన తర్వాత మరో మూడేళ్ల పాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించింది.

### కంప్యూటర్ సమస్య పేరుతో మొదలైన బెదిరింపులు

ఈ కేసులో మోసం మొదలైన తీరు అత్యంత పకడ్బందీగా సాగింది. ఒక్లహోమాలో ఉంటున్న వృద్ధుడికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము మైక్రోసాఫ్ట్ టెక్నికల్ సపోర్ట్ బృందం నుంచి మాట్లాడుతున్నామని, ఆయన కంప్యూటర్‌లో తీవ్రమైన చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరుగుతున్నాయని భయపెట్టారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఫెడరల్ అధికారులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఆ వృద్ధుడు తీవ్ర భయాందోళనలకు గురయ్యాడు.

### నగదును బంగారంగా మార్పించి దోపిడీ

బాధితుడిని మరింత నమ్మించేందుకు నిందితులు మరో ప్రమాదకరమైన ఎత్తుగడ వేశారు. చట్టపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలంటే ఆయన వద్ద ఉన్న నగదును వెంటనే బంగారంగా మార్చాలని, దర్యాప్తు కోసం ఇంటికి వచ్చే ఫెడరల్ అధికారికి ఆ బంగారాన్ని అప్పగించాలని సూచించారు. అధికారుల పేర్లు చెప్పి భయపెట్టడంతో నిజమేనని నమ్మిన ఆ వృద్ధుడు వారు చెప్పినట్లే తన పొదుపు మొత్తాన్ని బంగారంగా మార్చి అప్పగించాడు.

### అత్యాశే కొంపముంచింది

ఒకసారి మోసం విజయవంతమైన తర్వాత నిందితుల అత్యాశ మరింత పెరిగింది. కొద్ది రోజుల వ్యవధిలోనే మళ్లీ అదే వృద్ధుడికి ఫోన్ చేసి ఇంకా అదనపు నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు తన కుటుంబసభ్యులను సంప్రదించి తాను సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నట్లు గ్రహించి వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు పక్కా వ్యూహం పన్నారు. రెండోసారి డబ్బు, బంగారం కలెక్ట్ చేసుకోవడానికి బాధితుడి ఇంటికి వచ్చిన సమయంలో వెంకటేశ్వర చాగంరెడ్డిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కోర్టు దోషిగా తేల్చగా తాజాగా శిక్ష ఖరారు చేసింది.

### స్టూడెంట్ వీసాదారులకు హెచ్చరిక

అమెరికాలో ఇటీవల కాలంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మైక్రోసాఫ్ట్, ఫెడరల్ పోలీసులు, ఐఆర్ఎస్ (ట్యాక్స్) అధికారుల పేరుతో ఇలాంటి టెక్ సపోర్ట్ స్కామ్‌లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. తక్కువ సమయంలో సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో లేదా సైబర్ ముఠాల మాటలు నమ్మి కొరియర్లుగా, మనీ మ్యూల్స్‌గా మారుతున్నారు. విదేశీ విద్యార్థులకు ఈ కేసు ఒక తీవ్ర హెచ్చరికగా నిలుస్తోంది. ఒక్క తప్పుడు అడుగు భవిష్యత్తును నాశనం చేస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# నిబంధనలు పాటించేవాళ్లం కాదు.. రాసేవాళ్లం

- బ్రిక్స్ వేదికగా మోదీ పిలుపు..
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం..
- స్టార్టప్ ఫండ్ నుంచి కీలక ఖనిజాల వరకు సమష్టి సహకారానికి బాట




ప్రపంచంలో సంక్షోభాలు తలెత్తిన ప్రతిసారీ వాటి ప్రభావాన్ని మొదట ఎదుర్కొనేది గ్లోబల్ సౌత్ దేశాలేనని.. కానీ ప్రపంచ నిర్ణయాలు తీసుకునే వేదికల్లో మాత్రం వాటికి తగిన స్థానం దక్కడం లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇకపై గ్లోబల్ సౌత్ దేశాలు ఇతరులు రూపొందించిన నిబంధనలను కేవలం పాటించే స్థితిలో ఉండకూడదని.. ప్రపంచ నియమాలను రూపొందించే శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ పాలనా వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి.

ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలను ఒకేసారి ఎదుర్కొంటోందని మోదీ పేర్కొన్నారు. యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు, వాతావరణ మార్పులు, సాంకేతిక పరిణామాలతో వచ్చే కొత్త సవాళ్లు నేరుగా సామాన్యుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సమస్యలు ముదిరిన తర్వాత స్పందించడం కంటే.. వాటిని ముందుగానే గుర్తించి పరిష్కార మార్గాలను సిద్ధం చేసుకోవడం అవసరమన్నారు. అందులో భాగంగానే అంటువ్యాధులపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థ కోసం బ్రిక్స్ దేశాల మధ్య సహకారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. తాజా బ్రిక్స్ చర్చల్లో ఆరోగ్యం, ఆహారం, ఇంధనం, కృత్రిమ మేధ, సరఫరా గొలుసులు వంటి రంగాల్లో సహకారాన్ని పెంచే అంశాలపై దృష్టి పెట్టారు. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయకూడదని మోదీ స్పష్టం చేశారు. ఆర్థిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావని అన్నారు. భారతీయ నాగరికత ప్రకృతిని తల్లిగా భావిస్తూ అభివృద్ధి, పర్యావరణం మధ్య సమతుల్యతను పాటించిందని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత ప్రస్తుత తరంపై ఉందని పేర్కొన్నారు. బ్రిక్స్ విస్తరిస్తున్న నేపథ్యంలో భిన్నత్వమే ఈ కూటమి బలమని, విభిన్న అభిప్రాయాలను సమన్వయం చేసుకుంటూ ఉమ్మడి ప్రయోజనాల కోసం ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు.

### స్టార్టప్‌లకు ఉమ్మడి బలం

బ్రిక్స్ దేశాల ఆర్థిక సహకారాన్ని కొత్తస్థాయికి తీసుకెళ్లేలా బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు. ప్రత్యేక నిధి ద్వారా సభ్య దేశాల్లోని స్టార్టప్‌లు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తల మధ్య పరస్పర సంబంధాలు పెరుగుతాయని చెప్పారు. ఆలోచనలకు పెట్టుబడులు, పెట్టుబడులకు మార్కెట్లు, మార్కెట్లకు అంతర్జాతీయ సహకారం అందేలా బ్రిక్స్ వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నది ఈ ప్రతిపాదన వెనుక ఉద్దేశం. తాజా బ్రిక్స్ చర్చల్లో స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌తో పాటు బ్రిక్స్ ఇన్‌క్యుబేటర్ నెట్‌వర్క్‌ను ముందుకు తీసుకెళ్లే అంశాలకూ ప్రాధాన్యం లభించింది. ఇది కేవలం వ్యాపార సహకారానికి పరిమితం కాకుండా.. సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, పెట్టుబడులు, పరిశోధనల మార్పిడికి కూడా దోహదపడే అవకాశం ఉంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల యువతకు కొత్త అవకాశాలు సృష్టించేలా బ్రిక్స్ ఆర్థిక వ్యవస్థను అనుసంధానించాలన్న ఆలోచన ఇందులో కనిపిస్తోంది.

### జిన్‌పింగ్ సమక్షంలోనే కీలక ఖనిజాల ప్రస్తావన

అదే సమయంలో సాంకేతికత, కీలక ఖనిజాలను ఒక దేశ ప్రయోజనాల కోసం 'ఆయుధాలుగా' ఉపయోగించడాన్ని వ్యతిరేకించాలని మోదీ పిలుపునివ్వడం ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది. ఏ ఒక్క దేశం తన ఆధిపత్యాన్ని ఉపయోగించి కీలక వనరుల సరఫరాను నియంత్రించడం ప్రపంచ సమష్టి వృద్ధికి ఆటంకంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. మోదీ ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కూడా అక్కడే ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. అరుదైన ఖనిజాల శుద్ధి, సరఫరా రంగంలో చైనాకు అపార ఆధిపత్యం ఉంది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్, రక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక పరిశ్రమలకు ఈ ఖనిజాలు కీలకం. అందుకే వాటి సరఫరా గొలుసు ఏ ఒక్క దేశం చేతుల్లో కేంద్రీకృతం కాకుండా పారదర్శకంగా, స్థిరంగా ఉండాలని భారత్ చాలాకాలంగా కోరుతోంది.

మొత్తంగా మోదీ ప్రసంగం బ్రిక్స్‌ను కేవలం ఆర్థిక కూటమిగా కాకుండా ప్రపంచ పాలనా వ్యవస్థలో మార్పుకు వేదికగా చూడాలన్న భారత దృక్పథాన్ని ప్రతిబింబించింది. గ్లోబల్ సౌత్ ఇక నిర్ణయాల ప్రభావాన్ని భరించే సమూహంగా కాకుండా.. నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తిగా ఎదగాలన్న సందేశాన్ని భారత్ బలంగా వినిపించింది. అదే సమయంలో సాంకేతికత, ఖనిజాలు, పెట్టుబడులు, ఆరోగ్యం, పర్యావరణం వంటి రంగాల్లో సమష్టి సహకారంతోనే భవిష్యత్ ప్రపంచ సవాళ్లను ఎదుర్కోగలమన్న దిశను బ్రిక్స్‌కు సూచించింది.

# 'మధ్యప్రదేశ్ సీఎం'గా దీప్కే రాజీనామా!

- 30 మందికి పైగా గిరిజన చిన్నారుల మృతిపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ వ్యంగ్య నిరసన..
- ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రశ్నలకు ఘాటు సమాధానం



మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల వరుస మరణాల వ్యవహారం రాజకీయంగా వేడెక్కుతోంది. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు శనివారం అక్కడికి వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల నుంచి తీవ్ర అవహేళనలు ఎదురయ్యాయి. 'లాశలపై రాజకీయాలు చేయడానికి వచ్చారా?' అంటూ వారు ప్రశ్నించడంతో అక్కడ కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం దీప్కే తనదైన వ్యంగ్యశైలిలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బాలాఘాట్‌లోని ఆదోరి, కోర్కా, బొందారి గ్రామాలకు వెళ్లిన దీప్కే.. ఇటీవల చిన్నారులను కోల్పోయిన గిరిజన కుటుంబాలను కలుసుకున్నారు. పిల్లల మరణాలకు కారణాలు, గ్రామాల్లో అందుతున్న వైద్య సదుపాయాలు, తాగునీరు, పోషకాహారం వంటి అంశాలపై వివరాలు సేకరించారు. ఈ ప్రాంతంలో 30 మందికి పైగా పిల్లలు అంటువ్యాధులతో మరణించినట్లు వచ్చిన ఆరోపణలపై ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. ఆరోగ్య శాఖ, మహిళా-శిశు అభివృద్ధి శాఖ, బాలాఘాట్ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ అయ్యాయి. ఒక ఆసుపత్రిలో 50 పడకల సామర్థ్యానికి మించి సుమారు 400 మంది చిన్నారులకు చికిత్స అందిస్తున్నారన్న ఆరోపణలు కూడా పిల్‌లో ఉన్నాయి.

ఈ నేపథ్యంలో తనను ముఖ్యమంత్రిగా భావించి కొందరు విమర్శిస్తున్నారని దీప్కే ఎద్దేవా చేశారు. '30 మందికి పైగా గిరిజన పిల్లలు చనిపోయినందుకు నైతిక బాధ్యత వహిస్తూ మధ్యప్రదేశ్ సీఎం పదవికి రాజీనామా చేస్తున్నా' అంటూ సోషల్ మీడియాలో వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. తొలుత బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించి, నిరసనల అనంతరం దాన్ని రూ.4 లక్షలకు పెంచడాన్ని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యేల పిల్లలు చనిపోయి ఉంటే ఇంతే పరిహారం ఇచ్చేవారా అని నిలదీశారు. వైద్యాధికారులపై చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మరణాలకు అసలు కారణం ఏమిటన్నది ఇంకా పూర్తిగా తేలాల్సి ఉండగా, మలేరియా, మీజిల్స్, పోషకాహార లోపం, రక్తహీనత తదితర సమస్యలు ఈ ప్రాంతంలో తీవ్రంగా ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో బాలాఘాట్ ఘటనపై సమగ్ర వైద్య, పరిపాలనా విచారణకు డిమాండ్లు పెరుగుతున్నాయి

# 2029లోపు 21 రాష్ట్రాల్లో యూసీసీ!

- ముంబైలో అమిత్ షా కీలక ప్రకటన..
- ఉగ్రవాదంపై 'జీరో టాలరెన్స్'..
- మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు సేవా సంకల్ప్ అభియాన్

దేశంలో యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) అమలుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే బీజేపీ, ఎన్డీయే పాలనలో ఉన్న మొత్తం 21 రాష్ట్రాల్లో యూసీసీని అమలు చేస్తామని స్పష్టం చేశారు. ముంబైలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. వివాహం, విడాకులు, వారసత్వం వంటి వ్యక్తిగత చట్టాల విషయంలో దేశంలో ఏకరూపత తీసుకురావడం యూసీసీ లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన వర్గాల ప్రత్యేక గుర్తింపు, సంప్రదాయాలను కాపాడేందుకు అవసరమైన మినహాయింపులు కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు యూసీసీ అమలు దిశగా ముందడుగు వేశాయని షా చెప్పారు. మిగిలిన ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనూ ప్రక్రియను వేగవంతం చేస్తామని వెల్లడించారు. ఇదే సమయంలో జాతీయ భద్రత అంశంపైనా ఆయన మాట్లాడారు. తీవ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ సర్జికల్ స్ట్రైక్స్, వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలను ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దు, నక్సలిజంపై చర్యలు, ఈశాన్య రాష్ట్రాల్లో సమస్యల పరిష్కారం వంటి అంశాలను తమ ప్రభుత్వ ప్రధాన విజయాలుగా వివరించారు. 2014 తర్వాత దేశ రాజకీయాల్లో అవినీతి, కులతత్వం, వారసత్వ రాజకీయాలకు బదులుగా పనితీరుకు ప్రాధాన్యం పెరిగిందని షా అన్నారు. 'ఇండియా ఫస్ట్' అనే భావనతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. భారత్ ప్రపంచంలోని టాప్ ఐదు ఆర్థిక వ్యవస్థల్లోకి చేరిందని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని చెప్పారు. దేశంలో చాలాకాలంగా పరిష్కారం కాని సమస్యలకు తమ ప్రభుత్వం పరిష్కారాలు చూపిందని వివరించారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు షా ప్రకటించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెలరోజుల పాటు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. సెప్టెంబర్ 17న రక్తదాన శిబిరాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. అదే రోజు సాయంత్రం 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమం నిర్వహించనున్నారు. పాఠశాలల్లో 'మేరే సపోనే కా భారత్' పేరిట చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు, అక్టోబర్ 2న స్వచ్ఛత కార్యక్రమాలు, అక్టోబర్ 7న 'సేవా జ్యోతి కలశ యాత్ర' వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# మోదీని కలిసిన స్కూల్ మిత్రుడు


## తన భూవివాదంపై పార్టీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



ప్రధాని నరేంద్ర మోదీని ఆయన చిన్ననాటి స్నేహితుడు అస్గరఅలీ వోహ్రా ఇటీవల కలిశారు. గుజరాత్‌లోని భయందర్ ఈస్ట్‌లో తనకు చెందిన 2,810 చదరపు మీటర్ల భూమిని కొందరు బిల్డర్లు నకిలీ పత్రాలతో స్వాధీనం చేసుకున్నారని మోదీకి ఫిర్యాదు చేశారు. 1989లో కొనుగోలు చేసిన ఈ భూమిపై 2011 నుంచి న్యాయపోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ వ్యవహారంలో భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాతో సంబంధం ఉన్న 'సెవెన్ ఎలెవెన్ కన్స్ట్రక్షన్స్' పేరు కూడా ఉందని తెలిపారు. పోలీసులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. 2015లో ఎఫ్ఐఆర్ నమోదైనా.. దాదాపు 11 ఏళ్ల తర్వాత 2026లో కోర్టుకు నివేదిక సమర్పించారని చెప్పారు. రాజకీయ నేతల ఒత్తిళ్ల కారణంగానే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. తనకు న్యాయం చేసేందుకు సీబీఐ విచారణ జరిపించాలని మోదీని కోరారు. దీనిపై మోదీ ధైర్యం చెప్పినట్లు వోహ్రా తెలిపారు. కాగా, భూవివాదంపై ఈనెల 16న కోర్టులో విచారణ జరగనుంది.

# బ్రిక్స్ విందులో నాన్‌వెజ్ ఏదీ లేదేంటి?

- 'దేశంలో 80 శాతం మంది మాంసాహారులే'..
- ప్రధాని మోదీకి గుర్తులేదా? అంటూ ఎక్స్‌లో విపక్ష నేత ప్రశ్న




బ్రిక్స్ సదస్సులో దేశాధినేతలకు ఏర్పాటు చేసిన విందులో మాంసాహారం లేకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. నోరూరించే పలు రకాల రుచులతో భారతీయ వైవిధ్యాన్ని చాటామని గొప్పలు చెబుతున్న ప్రధాని నరేంద్ర మోదీకి 'దేశంలో 80 శాతం మాంసాహారులేనన్న సంగతి గుర్తులేదా?' అని రాహుల్ ధ్వజమెత్తారు. ఆదివారం ఎక్స్ వేదికగా బ్రిక్స్ ఆహ్వానితుల మెనూలో పూర్తిగా వెజ్‌కే ప్రాధాన్యం ఇవ్వడాన్ని తప్పుబట్టారు విపక్ష నేత రాహుల్. న్యూ ఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సమావేశానికి విచ్చేసిన సభ్య దేశాల నాయకులు, ప్రతినిధుల డిన్నర్ మెనూపై లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ ఫైరయ్యారు. మెనూలో అన్నీ శాకాహార వంటకాలే ఉండడంపై ఆగ్రహించిన ఆయన.. దేశంలో ఎనభైశాతం మంది మాంసాహారులే అనే విషయం ప్రధాని మోదీకి తెలియదా? అని ప్రశ్నించారు.

# పుతిన్‌కు మోదీ, జిన్‌పింగ్ శాంతి ప్రతిపాదన!

- రష్యా అధ్యక్షుడికి శాంతి చర్చల్లో సహకరిస్తామని హామీ..
- ప్రతిపాదనను స్వాగతించిన పుతిన్..
- యుద్ధ విరమణపై పెరుగుతున్న ఆశలు

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మరో కీలక ప్రయత్నం తెరపైకి వచ్చింది. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా పలువురు నేతలు శాంతి మార్గాన్ని అన్వేషించినప్పటికీ స్పష్టమైన ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో భారత్, చైనా దేశాలు తాము కూడా శాంతి ప్రక్రియకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రతిపాదించినట్టు రష్యా వెల్లడించింది. ఈ ప్రతిపాదనను పుతిన్ స్వాగతించినట్టు తెలుస్తోంది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశంలో ఉక్రెయిన్ యుద్ధం అంశం చర్చకు వచ్చినట్టు రష్యా అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా యుద్ధానికి శాంతియుత పరిష్కారం కనుగొనే ప్రయత్నాల్లో తాము సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని మోదీ, జిన్‌పింగ్ సూచించినట్టు రష్యా అధ్యక్ష కార్యాలయ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్



వెల్లడించారు.

యుద్ధం ప్రారంభమై చాలా కాలం గడిచినా రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం దిశగా గట్టి పురోగతి కనిపించలేదు. యుద్ధభూమిలో పరిస్థితులు మారుతున్నప్పటికీ ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని రెండు ప్రధాన దేశాలైన భారత్, చైనా శాంతి ప్రక్రియలో సహకరిస్తామని ముందుకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా-ఉక్రెయిన్ వివాదంపై భారత్ మొదటినుంచీ ఒకే వైఖరిని వ్యక్తం చేస్తోంది. యుద్ధంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని, ఇరు పక్షాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ పలుమార్లు స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెయిన్‌తో భారత్‌కు ఉన్న సంబంధాల కారణంగా మధ్యవర్తిత్వానికి అనుకూల వాతావరణం సృష్టించగల దేశంగా భారత్‌ను అంతర్జాతీయ వర్గాలు చూస్తున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా యుద్ధానికి ముగింపు పలికేందుకు పలు ప్రయత్నాలు చేశారు.

శాంతి చర్చల కోసం తన ప్రతినిధులను రష్యాకు పంపినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదు. దీంతో ఇప్పుడు మోదీ, జిన్‌పింగ్ ప్రతిపాదనపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. ఇదే సమయంలో రష్యాలో సెప్టెంబర్ 18నుంచి 20 వరకు పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత జరుగుతున్న తొలి పార్లమెంట్ ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. అధ్యక్షుడు పుతిన్‌కు మద్దతుగా ఉన్న యునైటెడ్ రష్యా పార్టీ విజయం సాధిస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యుద్ధాన్ని కొనసాగించడమా.. లేక చర్చల ద్వారా పరిష్కారాన్ని అన్వేషించడమా అన్నది రష్యాకు కీలకంగా మారింది. భారత్, చైనా దేశాలు శాంతి ప్రయత్నాలకు సహకరించేందుకు ముందుకు రావడం కొత్త దౌత్య అవకాశాలకు దారితీస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## రూల్స్ లేని ప్రపంచం.. సిగ్నల్స్ లేని కూడలే

- ఢిల్లీ బ్రిక్స్ వేదికగా జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు..
- గ్లోబల్ సౌత్ ఐక్యతకు పిలుపు

అంతర్జాతీయ వ్యవస్థలో నిబంధనలు బలహీనపడితే ప్రపంచం గందరగోళంలోకి జారిపోతుందని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హెచ్చరించారు. 'రూల్స్ లేని ప్రపంచం.. ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి లాంటిది' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు బ్రిక్స్ వేదికగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల మధ్య సంబంధాల్లో బలవంతుడిదే రాజ్యం అనే భావనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. దేశం పరిమాణం, ఆర్థిక శక్తి, సైనిక సామర్థ్యం ఏదైనా కావచ్చు.. అంతర్జాతీయ వ్యవస్థలో ప్రతి దేశానికీ సమాన హక్కులు ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ నియమాలను కొన్ని దేశాలు మాత్రమే నిర్ణయించడం కాకుండా.. అన్ని దేశాలు కలిసి రూపొందించే విధానం రావాలని సూచించారు. గ్లోబల్ సౌత్ దేశాల ఐక్యతకు బ్రిక్స్ కొత్త దిశ చూపాలని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. సరఫరా గొలుసులను మరింత బలోపేతం చేయడంతోపాటు సమీకృత మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు సభ్య దేశాలు కలిసి పనిచేయాలని అన్నారు. వాణిజ్యం, తయారీ, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని పెంచేందుకు



ఐదు సూత్రాల ప్రణాళికను కూడా ఆయన ప్రతిపాదించారు.

అంతర్జాతీయ చట్టాలు అన్ని దేశాలకూ సమానంగా వర్తించేలా చూడాల్సిన బాధ్యత గ్లోబల్ సౌత్ దేశాలపై ఉందని జిన్‌పింగ్ అన్నారు. ప్రపంచ వ్యవహారాల్లో ఐక్యరాజ్యసమితి అధికారాన్ని, పాత్రను బలోపేతం చేయాలని సూచించారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రపంచ రాజకీయాల్లో బహుళ ధ్రువ వ్యవస్థకు ప్రాధాన్యం పెరుగుతున్న సమయంలో జిన్‌పింగ్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. ముఖ్యంగా వాణిజ్య ఉద్రిక్తతలు, భౌగోళిక రాజకీయ విభేదాలు, సరఫరా గొలుసుల్లో అంతరాయాల నేపథ్యంలో గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని పెంచడమే లక్ష్యంగా బ్రిక్స్‌ను మరింత ప్రభావవంతమైన వేదికగా మార్చాలని చైనా భావిస్తున్నట్లు ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి.

## ఐరోపాను బెదిరించం.. కానీ చర్యలు తప్పవు!

- ఉక్రెయిన్‌లో యూరోపియన్ సైనికుల ప్రవేశంపై పుతిన్ హెచ్చరిక..
- ప్రత్యక్ష ఘర్షణకు దారితీస్తుందని వ్యాఖ్య

ఐరోపా దేశాలతో ఘర్షణ తమ లక్ష్యం కాదని.. అయితే రష్యా ప్రయోజనాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే స్పందించక తప్పదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరించారు. ఢిల్లీకి వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. ఉక్రెయిన్‌లోకి ఐరోపా దేశాలు తమ సైనికులను పంపే ఆలోచన చేస్తే అది రష్యాతో ప్రత్యక్ష ఘర్షణకు దారితీస్తుందని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌కు యూరోపియన్ దేశాలు ఆయుధాలు, సైనిక సహకారం అందించడాన్ని మాస్కో తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా శాంతిపరిరక్షణ దళాల పేరుతో సైనికులను ఉక్రెయిన్‌లో మోహరించే ప్రయత్నాలపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇలాంటి చర్యలను రష్యాతో యుద్ధానికి సమానంగా పరిగణించాల్సి వస్తుందని పుతిన్ అన్నారు. ఐరోపా దేశాలకు రష్యా నుంచి ముప్పు ఉందన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. ఐరోపాను బెదిరించాల్సిన అవసరం తమకు లేదని పేర్కొన్నారు. అయితే అంతర్జాతీయ చట్టాలను, రష్యా జాతీయ ప్రయోజనాలను దెబ్బతీసే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సంక్షోభానికి నాటో విస్తరణ, పాశ్చాత్య దేశాల జోక్యం కూడా కారణమని మాస్కో



చాలాకాలంగా ఆరోపిస్తోంది. మరోవైపు ఉక్రెయిన్‌కు పాశ్చాత్య దేశాల మద్దతు యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు అవసరమని కీవ్ చెబుతోంది. దీంతో రష్యా-ఐరోపా మధ్య అనుమానాలు మరింత ముదురుతున్నాయి.

ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ఉక్రెయిన్‌లోని జపోరిజ్జియా నగరంలో ఇద్దరు పౌరులు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. క్రిమియాలో మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. నల్ల సముద్ర తీరంలోని ఒడెసాలో జరిగిన దాడుల్లో 28 మంది గాయపడినట్లు సమాచారం. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ రష్యా-ఉక్రెయిన్ మాత్రమే కాకుండా రష్యా-ఐరోపా సంబంధాలపైనా ప్రభావం పడుతోంది. సైనికుల మోహరింపు అంశం తెరపైకి రావడం పరిస్థితిని మరింత సున్నితంగా మార్చింది. ఈ నేపథ్యంలో పుతిన్ హెచ్చరికలు భవిష్యత్ పరిణామాలపై ఆందోళనలను పెంచుతున్నాయి.

# 9/11కు ముందే భారత్‌పై లాడెన్ కుట్ర

- 1998 నుంచే భారత్ సహా పలు దేశాలపై దాడులకు ప్రణాళిక..
- 100 పేజీలకు పైగా నివేదిక విడుదల చేసిన అమెరికా నిఘా సంస్థ

అమెరికాను వణికించిన 9/11 ఉగ్రదాడులకు ఏళ్ల ముందే అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ తన ఉగ్రవాద వ్యూహాన్ని విస్తరించినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. భారత్‌తోపాటు ఈజిప్ట్, అరేబియా దేశాలు, ఉగాండావంటి పలు దేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రణాళికలు రూపొందించినట్లు అమెరికా నిఘా సంస్థ సీఐఏ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. 9/11 దాడులకు 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా విడుదలైన ఈ పత్రం లాడెన్ ఉగ్ర నెట్‌వర్క్ విస్తృతిని మరోసారి ప్రపంచం ముందుకు తీసుకొచ్చింది. 'బిన్ లాడెన్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్ స్టిల్ ఎ థ్రెట్' పేరుతో సీఐఏ విడుదల చేసిన ఈ నివేదిక 100 పేజీలకు పైగా ఉంది. 1998 నుంచి సేకరించిన నిఘా సమాచారాన్ని ఇందులో పొందుపరిచినట్లు తెలుస్తోంది. ఆ సమయంలోనే బిన్ లాడెన్ భారత్ సహా పలు దేశాల్లో దాడులకు ప్రణాళికలు రూపొందించినట్లు నివేదిక పేర్కొంది.

అయితే భారత్‌లో ఎక్కడ దాడి చేయాలని భావించాడు? ఎలాంటి లక్ష్యాలను ఎంచుకున్నాడు? దాడులను ఏ విధంగా అమలు చేయాలనుకున్నాడు? వంటి కీలక వివరాలను మాత్రం నివేదిక వెల్లడించలేదు. దీంతో లాడెన్ కుట్రకు సంబంధించిన పూర్తి వ్యూహం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. అయినప్పటికీ అమెరికాపై 9/11 దాడులకు మూడేళ్ల ముందే అతడి ఉగ్ర నెట్‌వర్క్ అంతర్జాతీయ స్థాయిలో దాడులకు సిద్ధమవుతోందనే విషయం ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. సీఐఏ అంచనాల ప్రకారం బిన్ లాడెన్‌కు చెందిన ఉగ్ర నెట్‌వర్క్ దాదాపు 50 దేశాల్లో విస్తరించి ఉంది. ఆఫ్ఘనిస్తాన్‌ను కేంద్రంగా చేసుకుని అల్‌ఖైదా కార్యకలాపాలను కొనసాగించాడు. 1998లో ఆఫ్ఘనిస్తాన్‌లోని అల్‌ఖైదా స్థావరాలపై అమెరికా క్షిపణి దాడులు చేసినప్పటికీ లాడెన్ వాటినుంచి తప్పించుకున్నాడు. ఆ తర్వాత కూడా అతడి నెట్‌వర్క్ కార్యకలాపాలు కొనసాగాయి.

2001 సెప్టెంబర్ 11న అమెరికాపై జరిగిన ఉగ్రదాడులతో బిన్ లాడెన్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగింది. అల్‌ఖైదా ఉగ్రవాదులు హైజాక్ చేసిన విమానాలను న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌పైకి ఢీకొట్టారు. ఈ దాడులతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో దాదాపు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. 19 మంది హైజాకర్లు కూడా మరణించారు. ఈ ఘటన తర్వాత బిన్ లాడెన్ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర ఉగ్రవాదిగా మారాడు. అమెరికా అతడి కోసం దాదాపు దశాబ్దం పాటు వేట కొనసాగించింది. చివరకు 2011 మే 2న పాకిస్తాన్‌లోని అబ్బొటాబాద్‌లో దాక్కున్న బిన్ లాడెన్‌ను అమెరికా ప్రత్యేక దళాలు హతమార్చాయి. అతడి మరణంతో అల్‌ఖైదా కార్యకలాపాలకు గట్టి దెబ్బ



తగిలినా.. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద ముప్పు పూర్తిగా తొలగిపోలేదని అమెరికా నిఘా సంస్థలు చెబుతూనే ఉన్నాయి. తాజాగా విడుదలైన ఈ నివేదిక కూడా అదే విషయాన్ని గుర్తుచేస్తోంది. 9/11కు ముందే లాడెన్ తన ఉగ్ర నెట్‌వర్క్‌ను ఎంత విస్తృతంగా విస్తరించాడో ఈ పత్రం మరోసారి స్పష్టం చేస్తోంది



## అభిషేక్ విధ్వంసం.. భారత్ ఘన విజయం

**-ఆఫ్ఘాన్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు..**

**-మూడు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం**

అఫ్ఘానిస్థాన్‌తో తొలి టీ20లో భారత్ అదరగొట్టింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసక బ్యాటింగ్‌కు తోడు ఇషాన్ కిషన్ మెరుపు ఇన్నింగ్స్‌తో టీమిండియా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అఫ్ఘానిస్థాన్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం 13.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. 32 బంతుల్లోనే 82 పరుగులు బాదిన అభిషేక్ శర్మ.. బౌండరీలతో అఫ్గాన్ బౌలర్లను ఉతికారేశాడు. అతడి దూకుడైన ఇన్నింగ్స్‌తో భారత్ లక్ష్యాన్ని ఆరంభం నుంచే చిన్నదిగా మార్చేసింది. ఇషాన్ కిషన్ 42 పరుగులతో కీలక సహకారం అందించాడు. సంజు శాంసన్ 10 పరుగులకే వెనుదిరిగాడు. అఫ్గాన్ బౌలర్లలో మహ్మద్ నబీ రెండు వికెట్లు తీయగా.. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచారు. అర్ష్‌దీప్ సింగ్ మూడు వికెట్లతో అఫ్గాన్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ పడగొట్టారు. ఇబ్రహీం జద్రాన్ 11 పరుగులు చేసి రనౌట్ కాగా.. నూర్ అహ్మద్ ఖాతా తెరవకుండానే రనౌటయ్యాడు. ఒక దశలో అఫ్గాన్ తక్కువ స్కోరుకే పరిమితమవుతుందనిపించినా.. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ ఎదురుదాడికి దిగాడు. అద్భుతమైన హాఫ్ సెంచరీతో 64 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. మహ్మద్ నబీ కూడా 33 పరుగులతో అతడికి అండగా నిలిచాడు. వీరిద్దరి పోరాటంతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 156/8 పరుగులు సాధించింది. అయితే ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో శివమ్ దూబే ఏకంగా 21 పరుగులు సమర్పించుకోవడం భారత బౌలింగ్‌లో కొంత ఆందోళన కలిగించింది.

156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ మెరుపు ఆరంభం అందించాడు. బంతి ఎక్కడ పడితే అక్కడ బౌండరీకి తరలిస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అఫ్గాన్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కేవలం 32 బంతుల్లోనే 82 పరుగులు సాధించి భారత విజయాన్ని దాదాపు ఖాయం చేశాడు. అతడి దూకుడుకు ఇషాన్ కిషన్ కూడా తోడవడంతో భారత్ పవర్‌ప్లేలోనే భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. అభిషేక్ నిష్క్రమించిన తర్వాత సంజు శాంసన్ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయినా.. అప్పటికే భారత్ విజయం దిశగా దూసుకెళ్లింది. ఇషాన్ కిషన్ 42 పరుగులతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగా.. మిగతా బ్యాటర్లు లాంఛనాన్ని పూర్తి చేశారు. చివరకు 13.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుని ఏడు వికెట్ల తేడాతో విజయాన్ని అందుకున్నారు.

ఈ మ్యాచ్‌లో భారత్‌కు రెండు స్పష్టమైన సానుకూల అంశాలు కనిపించాయి. ఒకటి అభిషేక్ శర్మ విధ్వంసక ఫామ్.. రెండోది స్వల్ప లక్ష్యాన్ని ఎంత వేగంగా ఛేదించగలదో చూపించిన భారత బ్యాటింగ్ దూకుడు. మరోవైపు అఫ్గానిస్థాన్‌కు ఒమర్‌జాయ్, నబీ పోరాటం ఊరటనిచ్చినా.. టాప్ ఆర్డర్ వైఫల్యం భారీ మూల్యం చెల్లించింది. భారత బౌలింగ్ విభాగం కూడా ఎక్కువ భాగం మ్యాచ్‌పై పట్టు సాధించింది. అయితే చివరి ఓవర్‌లో 21 పరుగులు ఇవ్వడం మాత్రం సరిదిద్దుకోవాల్సిన అంశంగా మిగిలింది. మొత్తంగా తొలి టీ20లో సమష్టిగా రాణించిన భారత్ సిరీస్‌లో శుభారంభం చేసింది. రెండో మ్యాచ్‌లోనూ ఇదే జోరు కొనసాగించి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది.

# లంకపై ప్రతీకారం.. ఆసియా కప్ మనదే!

**షఫాలీ, స్మృతి మెరుపులు..**

**శ్రీచరణి స్పిన్ మ్యాజిక్..**

**ఎనిమిదోసారి చాంపియన్లుగా భారత్**




బ్యాట్‌తో విరుచుకుపడ్డారు.. బంతితో బెంబేలెత్తించారు.. చివరకు ఆసియా కప్‌ను ఒడిసిపట్టారు! మహిళల ఆసియా కప్‌లో భారత జట్టు మరోసారి తన తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంది. అజేయంగా ఫైనల్ చేరిన టీమిండియా.. టైటిల్ పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ శ్రీలంకను చిత్తుగా ఓడించి ఎనిమిదోసారి ఆసియా కిరీటాన్ని ముద్దాడింది. గత సీజన్‌లో టైటిల్ పోరులో ఎదురైన పరాజయానికి అదే వేదికపై దెబ్బకు దెబ్బ అన్నట్టుగా ప్రతీకారం తీర్చుకుంది. 184 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకున్న భారత్.. శ్రీలంకను 110 పరుగులకే కట్టడి చేసి 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన లంక బౌలింగ్‌ను ఉతికేశారు. షఫాలీ 68 పరుగులతో విధ్వంసం సృష్టించగా.. స్మృతి 59 పరుగులతో అద్భుత సహకారం అందించింది. వీరిద్దరి దూకుడుతో భారత్ భారీ స్కోరుకు బాటలు వేసుకుంది. అనంతరం బంతి అందుకున్న భారత బౌలర్లు లక్ష్యాన్ని కాపాడుకునే పనిని చక్కగా పూర్తి చేశారు.

184 పరుగుల భారీ ఛేదనకు దిగిన శ్రీలంకకు ఆరంభంలోనే భారత బౌలర్లు షాక్ ఇచ్చారు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ దులానీని క్రాంతి క్లీన్‌బౌల్డ్ చేయడంతో లంక ఒత్తిడిలో పడింది. క్రాంతి, నందిని కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పరుగుల వేగాన్ని అడ్డుకున్నారు. పవర్‌ప్లే ముగిసేసరికి శ్రీలంక స్కోరు 31 పరుగులే. కెప్టెన్ చమరి ఆటపట్టు, విష్మీ గుణరత్నే క్రీజులో కుదురుకున్న తర్వాత లంకలో ఆశలు చిగురించాయి. ఆటపట్టు భారీ షాట్లతో ఎదురుదాడికి దిగగా.. గుణరత్నే కూడా ఆమెకు సహకరించింది. అయితే ప్రమాదకరంగా మారుతున్న ఆటపట్టును దీప్తి శర్మ తన అనుభవంతో బోల్తా కొట్టించింది. ఆ వికెట్‌తో లంక పతనం వేగమందుకుంది. ఆ తర్వాత భారత స్పిన్నర్లు చెలరేగడంతో శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్ వరుసగా కుప్పకూలింది. ముఖ్యంగా శ్రీచరణి స్పిన్ ఉచ్చులో లంక బ్యాటర్లు చిక్కుకున్నారు. 4 ఓవర్లలో కేవలం 20 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టిన ఆమె.. భారత విజయాన్ని ఖాయం చేసింది. షఫాలీ కూడా బంతితో తన వంతు పాత్ర పోషించడంతో లంకకు ఎక్కడా కోలుకునే అవకాశం దక్కలేదు.

ఈ విజయంతో భారత మహిళల క్రికెట్ మరో అరుదైన ఘనత నమోదు చేసింది. ఆసియా కప్‌లో ఇది టీమిండియాకు ఎనిమిదో టైటిల్. ఆసియా వేదికపై తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. గతేడాది వన్డే ప్రపంచకప్‌ను గెలిచి చరిత్ర సృష్టించిన భారత జట్టు.. ఇప్పుడు ఆసియా కప్‌ను కూడా సొంతం చేసుకోవడంతో తమ విజయ పరంపరను కొనసాగించింది. మరోవైపు వరుసగా రెండోసారి టైటిల్ గెలవాలన్న శ్రీలంక ఆశలు ఫైనల్లోనే ఆవిరయ్యాయి. ఈ మ్యాచ్‌లో భారత విజయానికి అసలు బలం సమష్టి ప్రదర్శనే. ఓపెనర్లు ఇచ్చిన మెరుపు ఆరంభాన్ని మిడిలార్డర్ సద్వినియోగం చేసుకోగా.. బౌలర్లు అదే దూకుడును కొనసాగించారు. భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 110 పరుగులకే పరిమితం చేయడం భారత జట్టు సంపూర్ణ ఆధిపత్యానికి నిదర్శనం. రెండేళ్ల క్రితం చేజారిన టైటిల్‌కు ఇప్పుడు ఘనంగా బదులు చెప్పిన టీమిండియా.. మరోసారి ఆసియా క్రికెట్‌కు తానే రాణినని నిరూపించింది.

# జూనియర్ల పసిడి పంజా..

**- హాకీలో భారత్ డబుల్ ధమాకా!**




ఆసియా హాకీ వేదికపై భారత జూనియర్లు పసిడి పంజా విసిరారు. ఏహెచ్‌ఎఫ్ జూనియర్ ఆసియా కప్‌లో అబ్బాయిలు, అమ్మాయిలు చాంపియన్లుగా నిలిచి మువ్వన్నెల జెండాను రెండుసార్లు రెపరెపలాడించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో తొలుత పురుషుల జట్టు దక్షిణ కొరియాపై ఏకపక్ష ఆధిపత్యంతో విజయభేరి మోగించగా.. ఆ వెంటనే మహిళల జట్టు ఉత్కంఠభరిత పోరులో చైనాను మట్టికరిపించింది. రెండు ఫైనల్స్.. రెండు స్వర్ణాలు.. భారత హాకీకి ఒకే రోజు డబుల్ ధమాకా! టైటిల్ పోరులో ఒత్తిడి, ప్రత్యర్థి ప్రతిఘటన ఏదీ భారత యువ ఆటగాళ్ల దూకుడును ఆపలేకపోయింది. ముఖ్యంగా పురుషుల జట్టు ఆరంభం నుంచే టాప్ గేర్‌లో దూసుకెళ్లింది. బంతిపై పూర్తి పట్టు సాధిస్తూ వేగవంతమైన పాస్‌లు, కచ్చితమైన కాంబినేషన్లు, పదునైన దాడులతో కొరియా రక్షణను ఉక్కిరిబిక్కిరి చేసింది. మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం సాధించి దాడులకు బలమైన పునాది వేసిన భారత ఆటగాళ్లు.. ప్రత్యర్థికి కోలుకునే అవకాశమే ఇవ్వలేదు. ఫైనల్ అనే ఒత్తిడి కనిపించకుండా ఆడిన యువకులు చివరకు ఆసియా చాంపియన్లుగా నిలిచారు.

మహిళల ఫైనల్ మాత్రం నరాలు తెగే ఉత్కంఠకు వేదికైంది. భారత్, చైనా జట్లు ప్రతి క్షణం పోరాడాయి. దాడులు, ప్రతిదాడులతో మ్యాచ్ హోరాహోరీగా సాగినా.. భారత అమ్మాయిలు కీలక సందర్భాల్లో చూపిన సంయమనం, పట్టుదల విజయాన్ని అందించింది. చైనా ఫార్వర్డ్‌లకు భారత రక్షణ విభాగం గట్టి అడ్డుకట్ట వేయగా.. మరోవైపు లభించిన అవకాశాలను దాడి విభాగం సద్వినియోగం చేసుకుంది. చివరి వరకు ప్రత్యర్థి ఒత్తిడి ఉన్నప్పటికీ ఏమాత్రం తడబడకుండా పోరాడిన భారత జట్టు స్వర్ణాన్ని ఒడిసిపట్టింది. ఈ రెండు విజయాల్లోనూ కనిపించిన సామాన్య అంశం సమష్టి ప్రదర్శనే. వ్యక్తిగత ప్రతిభ కంటే జట్టు వ్యూహానికి ప్రాధాన్యమిస్తూ.. వేగం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, మానసిక దృఢత్వంతో భారత జట్లు ఆకట్టుకున్నాయి. ఒకవైపు కొరియాను చిత్తు చేసిన అబ్బాయిల దూకుడు.. మరోవైపు చైనాను నిలువరించిన అమ్మాయిల పోరాటపటిమ.. భారత జూనియర్ హాకీ బలాన్ని ప్రపంచానికి చాటాయి.

ఈ డబుల్ గోల్డ్ విజయానికి మరో పెద్ద విలువ ఉంది. ఏహెచ్‌ఎఫ్ జూనియర్ ఆసియా కప్‌లో చాంపియన్లుగా నిలిచిన భారత జట్లు ఎఫ్ఐహెచ్ జూనియర్ వరల్డ్‌కప్ బెర్తులను కూడా దక్కించుకున్నాయి. అంటే ఆసియా పసిడి సంబరాలు ఇక్కడితో ముగియవు. ఇప్పుడు ప్రపంచ వేదికపై భారత యువ హాకీ యోధులకు అసలు పరీక్ష ఎదురుకానుంది. సీనియర్ జట్ల నుంచి ఎప్పుడో ఒకప్పుడు వచ్చే విజయాల కంటే.. జూనియర్ స్థాయిలో పటిష్ఠమైన బృందాన్ని తయారు చేయడం భవిష్యత్ విజయాలకు అసలు పునాది. ఆ దిశగా ఈ విజయం భారత హాకీకి గొప్ప భరోసా. సీనియర్ జట్ల ఫలితాలు అప్పుడప్పుడు అభిమానులను నిరాశపరిచినా.. జూనియర్లు మాత్రం కొత్త ఆశలు రేకెత్తిస్తున్నారు. భవిష్యత్ భారత జట్టుకు కావాల్సిన ప్రతిభ, వేగం, వ్యూహాత్మక అవగాహన, పోరాట స్ఫూర్తి ఈ యువ ఆటగాళ్లలో కనిపిస్తోంది. ఆసియాలో ప్రత్యర్థులను మట్టికరిపించిన ఈ జట్లు ఇప్పుడు ప్రపంచకప్‌లోనూ అదే జోరును కొనసాగించాలి. పోడియంపై రెండుసార్లు ఎగిరిన మువ్వన్నెల జెండా.. ఇక ప్రపంచ వేదికపై మరింత ఎత్తుకు ఎగరాలి. ఆసియా పసిడితో మొదలైన ఈ జూనియర్ల పయనం.. ప్రపంచ స్వర్ణం దిశగా సాగాలని భారత హాకీ అభిమానుల ఆశ.

# పాక్ క్రికెట్ గాడి తప్పింది!

**- టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదు..**

**- జట్టు ఎంపిక, కెప్టెన్సీపై దినేశ్ కార్తిక్ అసంతృప్తి**

పాకిస్థాన్ క్రికెట్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలపై భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ కీలక వ్యాఖ్యలు చేశాడు. టెస్టుల్లో గొప్ప చరిత్ర కలిగిన పాక్.. ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా టెస్టు దేశాలతో పోటీపడే స్థితిలో లేదని వ్యాఖ్యానించాడు. తాజాగా ఇంగ్లాండ్‌పై మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ వైట్‌వాష్‌కు గురైన నేపథ్యంలో దినేశ్ కార్తిక్ ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశాడు."నేను ఇంగ్లాండ్ వర్సెస్ పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యానం చేసినప్పుడు ఈ పాక్ జట్టు చాలా సాధారణంగా అనిపించింది. మొదటి రెండు టెస్టుల్లో వారు రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేదు. పిచ్‌లు చాలా కఠినంగా ఉన్నాయి. కానీ, రెండు ఇన్నింగ్స్‌లో కలిపి 90 ఓవర్లు కూడా ఆడలేనంత క్లిష్టమైన పిచ్‌లు కావవి. పాకిస్థాన్ జట్టు టెస్ట్ క్రికెట్‌కు అపకారం చేస్తోందని నాజర్ హుస్సేన్ (ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్)అన్నాడు.నేను అతనితో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. చివరి టెస్టులో రజావుల్లా బాగా రాణించాడు. అతను ఆరంభం నుంచే జట్టులో ఎందుకు లేడు? అసలు ఎంపిక ప్రక్రియలో ఏం జరుగుతోంది?

ఎలాంటి ఆటగాళ్లను తీసుకుంటున్నారు? కెప్టెన్సీ మార్పులు, కోచ్‌ల మార్పులు అన్నీ అస్థిరంగా కనిపిస్తున్నాయి. ఆ ప్రభావం వారి ఆటతీరులో స్పష్టంగా కనిపిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో వారు ఆశించిన స్థాయిలో ఆడలేదు. కనీసం గట్టి పోటీనిచ్చేలా కూడా అనిపించలేదు. నిజాయితీగా చెప్పాలంటే, ప్రస్తుత పరిస్థితుల్లో వారు చాలా టెస్ట్ ఆడే దేశాలతో పోటీ పడగలరని నాకు అనిపించడం లేదు. ఇది నిజంగా బాధాకరం. టెస్ట్ క్రికెట్‌లో పాక్కు గొప్ప చరిత్ర ఉంది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వారు ఆ స్థాయికి ఏమాత్రం దగ్గరగా లేరు. పాక్ క్రికెట్లో పరిస్థితి ఆందోళనకరంగా కనిపిస్తోంది. సరైన వ్యక్తులు దీనిని గమనించి తిరిగి గాడిలో పెట్టడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో అది అంత సులభమైన పనిలా అనిపించడం లేదు" అని దినేశ్ కార్తీక్ వివరించాడు.

చైతన్య రథం సినిమా
సోమవారం 14 సెప్టెంబర్ 2026 X

# ఉత్తమ నటుడు నాగచైతన్య

## అట్టహాసంగా సైమా అవార్డుల సంబరం




సైమా అవార్డ్స్-2026 వేడుక అట్టహాసంగా జరిగింది. బెంగళూరులోని కోరమంగళ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగిన అవార్డుల సంబరానికి దక్షిణాది సినీ తారలు విచ్చేసి సందడిచేశారు. రెండు రోజులపాటు జరిగే వేడుకలో భాగంగా తొలిరోజు తెలుగు, కన్నడ సినిమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులు అవార్డులు అందుకున్నారు.

'తండేల్'లో నటనకుగానూ నాగచైతన్య ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అలాగే 'మిరాయ్'లో నటనకుగానూ యువ కథానాయకుడు తేజ సజ్జా ఉత్తమ నటుడి (క్రిటిక్స్) అవార్డును అందుకున్నారు. మూవీ వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఈ అవార్డును కూడా అందుకోవడం మరో విశేషం. ఇక ఉత్తమ నటి (క్రిటిక్స్) అవార్డును 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటనకుగానూ ఐశ్వర్య రాజేశ్‌ను వరించింది. ఉత్తమ దర్శకుడిగా అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం) ఉత్తమ హాస్యనటుడి అవార్డును బుల్లిరాజు అలియాస్ భీమల రేవంత్ (సంక్రాంతికి వస్తున్నాం) అందుకున్నారు. ఇక 'కాంతార: చాప్టర్1లో అద్భుతంగా నటించి ప్రేక్షకులను అలరించిన కన్నడ నటుడు రిషబ్ శెట్టి ఉత్తమ నటుడి అవార్డు సొంతమైంది.

- ఉత్తమ నటుడు – నాగచైతన్య (తండేల్)
- ఉత్తమ నటుడు (క్రిటిక్స్) – తేజ సజ్జా (మిరాయ్)
- ఉత్తమ నటి (క్రిటిక్స్)– ఐశ్వర్య రాజేశ్ (సంక్రాంతికి వస్తున్నాం)
- ఉత్తమ దర్శకుడు – అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
- ఉత్తమ దర్శకుడు (క్రిటిక్స్) – చందూ మొండేటి (తండేల్)
- ఉత్తమ చిత్రం – మిరాయ్
- ఉత్తమ ప్రతినాయకుడు – మంచు మనోజ్ (మిరాయ్)
- ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్ (సంక్రాంతికి వస్తున్నాం)
- బెస్ట్ ఎంటర్టైనర్ – వెంకటేశ్ (సంక్రాంతికి వస్తున్నాం)
- ఉత్తమ సహాయ నటుడు – సత్యదేవ్ (కింగ్డమ్)
- ఉత్తమ సహాయ నటి – శ్రద్ధా శ్రీనాథ్ (డాకు మహారాజ్)
- ఉత్తమ హాస్య నటుడు – బుల్లిరాజు (సంక్రాంతికి వస్తున్నాం)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ – కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు – రమణ గోగుల (సంక్రాంతికి వస్తున్నాం)
- ఉత్తమ నేపథ్య గాయని – సమీరా భరద్వాజ్ (కోర్ట్)
- ఉత్తమ నటుడు (పరిచయం) – హర్ష్ రోషన్ (కోర్ట్)
- ఉత్తమ నటి (పరిచయం) – శ్రీదేవి (కోర్ట్)
- ఉత్తమ నటి (పరిచయం) – సాక్షి మడోల్కర్ (మోగ్లీ)
- ఉత్తమ గేయ రచయిత – పూర్ణా చారి (కోర్ట్)





# తండ్రి పాత్రలో బాలయ్య.. కొడుకుగా మోక్షజ్ఞ!

### డెబ్యూ మూవీలోనే అదిరిపోయే సర్‌ప్రైజ్?

నందమూరి మోక్షజ్ఞ సినీ ఎంట్రీ కోసం బాలయ్య అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఆయన డెబ్యూ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో నందమూరి అభిమానుల్లో సందడి మొదలైంది. దర్శకుడు వశిష్ఠతో మోక్షజ్ఞ తొలి సినిమా చేయబోతున్నట్లు వెల్లడైనప్పటి నుంచి సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో చక్కర్లు కొడుతోంది. సినిమాలో బాలకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారని.. అంతేకాదు, మోక్షజ్ఞ తండ్రి పాత్రలోనే ఆయన నటించనున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వార్తపై అధికారిక స్పష్టత



రావాల్సి ఉంది. నిజంగా బాలయ్య తండ్రి పాత్రలో కనిపిస్తే.. తండ్రి-కొడుకులుగా ఒకే సినిమాలో నందమూరి వారసత్వాన్ని తెరపై చూడటం అభిమానులకు ప్రత్యేక అనుభూతిగా మారడం ఖాయం. మరోవైపు మోక్షజ్ఞను సాధారణ మాస్ హీరోగా కాకుండా.. పూర్తిగా కొత్త కాన్సెప్ట్‌తో పరిచయం చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే వశిష్ఠను దర్శకుడిగా ఎంపిక చేశారని టాక్. 'బింబిసార'తో భారీ విజయాన్ని అందుకున్న వశిష్ఠ.. ఆ తర్వాత 'విశ్వంభర'తో మిశ్రమ స్పందన ఎదుర్కొన్నారు. దీంతో మోక్షజ్ఞ-వశిష్ఠ కాంబినేషన్‌పై అప్పుడే చర్చ మొదలైంది. అయితే డెబ్యూ హీరోను ఎలా పరిచయం చేస్తారన్నదే ఇక్కడ కీలకం. తొలి సినిమాతోనే మోక్షజ్ఞకు ప్రత్యేకమైన ఇమేజ్ తీసుకురావాలంటే కథ, పాత్ర, స్క్రీన్ ప్రజెన్స్ అన్నీ బలంగా ఉండాలి. రొటీన్ మాస్ కథలోకి వెళ్లకుండా కొత్త ప్రపంచాన్ని చూపించగలిగితే ఈ సినిమా మోక్షజ్ఞ కెరీర్‌కు మంచి ప్రారంభం అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.



# 'ఇరుముడి' డిజిటల్ రిలీజ్‌కు డేట్ ఫిక్స్

శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన సినిమా 'ఇరుముడి'. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. అయితే, సినిమా నాలుగో వారంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఓటీటీ విడుదలపై అధికారిక ప్రకటన వెలువడింది. సెప్టెంబర్ 18న పలు భాషల్లో డిజిటల్ వేదికపై సినిమా విడుదల కానుంది. నెట్‌ఫ్లిక్స్ ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన 'ఇరుముడి', ఇప్పుడు భారీ అంచనాల మధ్య స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతోంది. ఏదేమైనా ఈ సినిమాతో శివ నిర్వాణ స్థాయి పెరిగింది. ప్రధానంగా 'ఇరుముడి'తో తనదైన మేకింగ్, కథన శైలితో దర్శకుడిగా శివ నిర్వాణ ఆకట్టుకున్నాడు. మొత్తానికి ఫ్యామిలీ థ్రిల్లర్ డ్రామా మూవీకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు.

# బాక్సాఫీస్‌పై భక్తి ప్రభంజనం!



చిన్న సినిమాలకు పెద్ద కలలు కనొచ్చని మరోసారి నిరూపించింది 'హనుమాన్ అంశ'. భారీ స్టార్ కాస్టింగ్ లేదు.. వందల కోట్ల బడ్జెట్ లేదు.. అట్టహాసపు ప్రమోషన్లు లేవు. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన భక్తి ప్రధాన చిత్రం ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలన విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా విడుదలైన తొలి రోజున కేవలం రూ.10 లక్షలతో మొదలైన సినిమా.. తర్వాత మౌత్ టాక్‌తో ఊహించని స్థాయిలో పుంజుకోవడం ఇప్పుడు సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'హనుమాన్ అంశ' విషయంలో మొదటి రోజు పెద్దగా సందడి లేకపోయినా.. సినిమా చూసిన ప్రేక్షకులు ఇచ్చిన పాజిటివ్ టాక్ క్రమంగా థియేటర్లకు జనాన్ని తీసుకొచ్చింది. చివరకు రూ.2 కోట్ల పెట్టుబడిని దాదాపు వంద రెట్లస్థాయిలో అధిగమించే వసూళ్లను సాధించింది. సినిమా విజయానికి కథే ప్రధాన బలంగా నిలిచింది. ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం, బోధనల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కథ.. ఓ యువకుడి ఆధ్యాత్మిక అన్వేషణ చుట్టూ తిరుగుతుంది. తల్లి మరణం తర్వాత జీవితం, మరణం, ఆత్మ, ఆధ్యాత్మికత వంటి ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ అతడు ఉత్తర భారతదేశంలో ప్రయాణం మొదలుపెడతాడు. ఆ ప్రయాణం క్రమంగా అతడి జీవితాన్నే మార్చేస్తుంది. చివరకు ఆధ్యాత్మిక గురువుగా మారే వరకు సాగిన అతడి ప్రయాణమే కథకు హృదయం. భక్తి ప్రధానమైన కథ అయినప్పటికీ.. దర్శకుడు విశాల్ చతుర్వేది దాన్ని కేవలం ఆధ్యాత్మిక సందేశాలకే పరిమితం చేయకుండా, ఓ వ్యక్తి అంతర్మథనం, అన్వేషణ, మార్పు వంటి అంశాలతో తెరకెక్కించారు. అందుకే కుటుంబ ప్రేక్షకులతో పాటు ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి ఉన్నవారినీ సినిమా ఆకట్టుకుంటోంది. కథలోని భావోద్వేగ అంశాలు ప్రేక్షకులతో కనెక్ట్ కావడం కూడా మౌత్ టాక్‌కు కారణం. షోభినవ్ సత్య ప్రధాన పాత్రలో నటించిన చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకుడు. పెద్ద బడ్జెట్ కంటే బలమైన కథ, ప్రేక్షకుల నమ్మకం ఉంటే సినిమా ఏ స్థాయికి వెళ్లగలదో 'హనుమాన్ అంశ' విజయం మరోసారి చాటుతోంది.

# సామ్ ఆల్ట్‌మాన్ కథ..

## ఏఐ ప్రపంచం వెనుక దాగిన బోర్డు రూమ్ యుద్ధం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని మార్చేస్తున్న వేళ.. ఆ విప్లవానికి కేంద్రబిందువుగా నిలిచిన వ్యక్తి జీవితం ఇప్పుడు వెండితెరపైకి వస్తోంది. చాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మాన్ జీవితంలోని సంచలన పరిణామాల ఆధారంగా తెరకెక్కుతున్న హాలీవుడ్ చిత్రం 'ఆర్టిఫిషియల్స్'పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చింది. సాధారణ బయోపిక్‌లా సామ్ ఆల్ట్‌మాన్ బాల్యం నుంచి విజయగాథ వరకు చూపించే ప్రయత్నం కాకుండా.. ఆయన కెరీర్‌లో అత్యంత నాటకీయమైన ఘట్టాన్ని కథకు కేంద్రంగా ఎంచుకున్నారు. ముఖ్యంగా 2023 నవంబర్‌లో ఓపెన్ ఏఐలో చోటుచేసుకున్న కార్పొరేట్ సంక్షోభం సినిమాకు ప్రధాన కథాంశంగా నిలుస్తోంది. ప్రపంచ టెక్ రంగాన్ని ఒక్కసారిగా కుదిపేసిన ఆ పరిణామాలు అప్పట్లో అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. ఓపెన్ ఏఐ బోర్డు ఎలాంటి ముందస్తు సంకేతాలు లేకుండానే సామ్ ఆల్ట్‌మాన్‌ను సీఈవో పదవి నుంచి తొలగించడం సంచలనంగా మారింది. ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన ఏఐ సంస్థకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తిని ఒక్కసారిగా తప్పించడంపై టెక్ ప్రపంచం విస్తుపోయింది. అయితే ఆ నిర్ణయం ఎక్కువకాలం నిలవలేదు. కంపెనీ ఉద్యోగులు, పెట్టుబడిదారులు, ఇతర వర్గాలనుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో పరిస్థితులు వేగంగా మారాయి. చివరకు ఐదు రోజుల వ్యవధిలోనే ఆల్ట్‌మాన్ తిరిగి సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక అసలు ఏం జరిగింది? బోర్డు నిర్ణయానికి కారణాలేమిటి? ఓపెన్‌ఏఐలో అధికార సమీకరణలు ఎలా మారాయి? ఏఐ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాలు సంస్థలో ఎలాంటి విభేదాలకు దారితీశాయి?వంటి అంశాలను సినిమా థ్రిల్లర్ తరహాలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. టెక్నాలజీ, వ్యాపారం, అధికారం.. ఈ మూడు అంశాల కలయిక సినిమాకు ప్రత్యేకతను తీసుకురానుంది.

సామ్ ఆల్ట్‌మాన్ పాత్రలో ఆండ్రూ గార్ఫీల్డ్ నటిస్తున్నారు. 'ది సోషల్ నెట్‌వర్క్'తో టెక్ ప్రపంచానికి సంబంధించిన కథలో మెప్పించిన ఆయన మరోసారి అదే తరహా నేపథ్యంలోని పాత్రలో కనిపించనున్నారు. లూకా గ్వాడగ్నినో దర్శకత్వం వహిస్తుండగా, 'ఎస్ఎన్ఎల్' ఫేమ్ సైమన్ రిచ్ స్క్రిప్ట్ అందించారు. ఎలాన్ మస్క్‌గా ఐక్ బారిన్‌హోల్ట్జ్, మీరా మురతిగా మోనికా బార్బరో, ఇల్యా సుత్స్కేవర్‌గా యూరా బోరిసోవ్, ఏఐ పయనీర్ జెఫ్రీ హింటన్‌గా మార్క్ రైలన్స్ నటిస్తున్నారు. అక్టోబర్‌లో న్యూయార్క్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రీమియర్ కానున్న ఈ చిత్రం.. డిసెంబర్ 25న థియేటర్లలోకి రానుంది. ఏఐ ప్రపంచాన్ని మార్చిన మనిషి జీవితంలో జరిగిన అసలు 'డ్రామా'ను హాలీవుడ్ ఎంత ఉత్కంఠభరితంగా చూపించిందో చూడాలి.